



# విజయభాను






హైదరాబాద్, సోమవారం 23-10-2017 VIJAYABHANU DAILY HYDERABAD EDITION సంపుటి : 37 సంచిక : 39 పేజీలు : 8 వెల : 1 రూపాయి

## ప్రజల్లో పెరిగిన నమ్మకం నిలబెట్టుకోవాలి

-ప్రభుత్వ దవాఖానలకు దశలవారీగా కొత్త భవనాలు -రేషన్ బియ్యం పక్కదారిపడుతున్నది
-పౌరసరఫరాల శాఖలో నగదు బదిలీపై చర్చ
-వైద్య, ఆరోగ్య, పౌర సరఫరాలశాఖలపై సమీక్షలో సీఎం



హైదరాబాద్ : ప్రజావైద్యులను ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు భుజంతట్టి ప్రోత్సహిస్తున్నారు. కేసీఆర్ కిట్స్ పథకం వల్ల పెరిగిన పనిభారాన్ని మోస్తూ, ఓపికగా, చిత్తశుద్ధితో పేదలకు వైద్య సేవలందిస్తున్న వైద్యులకు నగదు ప్రోత్సాహకం అందించే ఫైల్‌పై ఆయన సంతకంచేశారు. రాబోయేకాలంలో రాష్ట్రంలో ప్రజావైద్యం ఎలా ఉండాలన్న అంశంపై హెల్త్‌మ్యాప్ రూపొందించాలని అధికారులను కోరారు. ప్రజాపంపిణీ వ్యవస్థలో సరుకులు పంపిణీ చేయటం ఉత్తమమా? లేక నగదు బదిలీ పథకం అమలుచేయటం ఉత్తమమా? అనే అంశంపై ఆలోచించాలని అధికారులకు చెప్పారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రగతిభవన్‌లో శనివారం వైద్య ఆరోగ్యశాఖ, పౌర సరఫరాలశాఖలపై సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశాలలో మంత్రి సీ లక్ష్మారెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్, ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్‌శర్మ, ఆయాశాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

### వైద్యుల సేవలు శ్లాఘనీయం

కేసీఆర్ కిట్స్ పథకం వల్ల ప్రభుత్వ దవాఖానల్లో పనిభారం పెరిగింది. పీహెచ్సీ నుంచి టీచింగ్ హాస్పిటల్స్ వరకు ప్రతిచోటా పేషెంట్ల సంఖ్య పెరుగుతున్నది. కేటాయించిన బెడ్లకన్నా ఎక్కువ సంఖ్యలో పేషెంట్లు వస్తున్నా సరే, పేదలకు వైద్య సేవలు అందించాలనే మంచి ఉద్దేశంతో వైద్యులు, వైద్య సిబ్బంది సేవలందిస్తున్నారు. చాలామంది ఓవర్ టైమ్ పనిచేస్తున్నారు. వారి సేవలు శ్లాఘనీయం.

ప్రజలు వైద్యుల సేవలను కొనియాడుతున్నారు. ప్రభుత్వ దవాఖానల్లో పనితీరు మారింది. వైద్యులకు, సిబ్బందికి హృదయపూర్వకంగా కృతజ్ఞతలు చెప్పాలి అని సీఎం వైద్యులను అభినందించారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవటానికి వైద్యశాఖ మరింత క్రియాశీలకంగా పనిచేయాలని వైద్యులకు పిలుపు నిచ్చారు. వైద్యశాఖకు ప్రభుత్వం అవసరమైన చేయూత అందిస్తుందని స్పష్టంచేశారు. కేసీఆర్ కిట్స్ బహుళ ప్రయోజనాలు అందిస్తున్నది.

రో రో ఫెర్రీ దేశంలో

## మొట్టమొదటి ప్రాజెక్టు

- రవాణా రంగంలో కోటి ఉద్యోగాలను సృష్టిస్తాం - పాడి పరిశ్రమ ప్రాజెక్టును ప్రారంభించడం సంతోషంగా ఉంది
- యూపీఏ ప్రభుత్వం అనేక ప్రాజెక్టులను నిలిపేసింది
రాష్ట్రాభివృద్ధిని అడ్డుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు జరిగాయి : మోదీ



ఘోఘా : రో రో ఫెర్రీ ప్రాజెక్టు మన దేశానికి విశిష్ట వరమని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ చెప్పారు. ఇది మన దేశంలో మొట్టమొదటి ప్రాజెక్టు అని తెలిపారు. ఇది ఘోఘా-దహేజ్ మధ్య నడిచే సర్వీసు అయినప్పటికీ యావత్తు దేశానికి చాలా ముఖ్యమైనదని వివరించారు. ఫెర్రీ తొలి దశను ఆదివారం ప్రారంభించిన అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ గత యూపీఏ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. గుజరాత్ అభివృద్ధికి యూపీఏ ప్రభుత్వం అడ్డుకుందని ప్రజలకు వివరించారు.

2012లో తాను శంకుస్థాపన చేసిన రోల్ ఆన్, రోల్ ఆఫ్ (రో రో) ఫెర్రీ సర్వీసు ప్రారంభమవడంతో తన తరువాయి 2లో

## గుజరాత్ ఎన్నికలు ఆప్ తొలి జాబితా విడుదల

అహ్మదాబాద్ : గుజరాత్ శాసనసభ ఎన్నికలకు ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) చురుగ్గా సమాయత్తమవుతోంది. 11 మంది అభ్యర్థులతో తొలి జాబితాను ప్రకటించింది. రాజ్‌కోట్ (పశ్చిమ)తో సహా 11 నియోజకవర్గాలకు అభ్యర్థుల పేర్లను ప్రకటించింది. బీజేపీ నేత, గుజరాత్ ముఖ్యమంత్రి విజయ్ రూపానీ రాజ్‌కోట్ (పశ్చిమ) నియోజకవర్గం ఎమ్మెల్యే. ఆయనపై ప్రముఖ వ్యాపారవేత్త రాజేశ్ భుట్‌ను ఆప్ నిలిపింది.

ఢిల్లీ రాష్ట్ర మంత్రి, ఆప్ గుజరాత్ ఎన్నికల ఇన్‌ఛార్జి గోపాల్ రాయ్ మీడియాతో మాట్లాడుతూ తమ పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశంలో ఈ జాబితాను ఖరారు చేసినట్లు తెలిపారు. గుజరాత్‌లో 182 శాసనసభ నియోజక వర్గాలకు డిసెంబరులో ఎన్నికలు జరుగుతాయి.






### నాగుల చవితి విశిష్టత



వార్త 8లో....

## భారత్ అమ్ముల పొదిలో మరిన్ని అస్త్రాలు



న్యూఢిల్లీ/వాషింగ్టన్ : రక్షణ రంగాన్ని మరింత బలోపేతం చేసేదిశగా భారత్ అడుగులు వేస్తోంది. ఇప్పటికే అంతర్జాతీయంగా దౌత్య సంబంధాలను మరింత పటిష్టం చేసుకున్న భారత్.. రక్షణ బంధాన్ని ధృఢతరం చేసుకుంటోంది. అమెరికా, ఫ్రాన్స్‌లతో ఇప్పటికే కీలక రక్షణ ఒప్పందాలను చేసుకున్న భారత్‌కు మరిన్ని సానుకూల సంకేతాలను ఆయా దేశాలు పంపాయి. ఫ్రాన్స్‌కు చెందిన శక్తివంతమైన రాఫెల్ యుద్ధవిమానాలను మరిన్ని భారత్‌కు అమ్మేందుకు ఫ్రాన్స్ అంగీకరించింది. అదే విధంగా ఆర్మ్‌డ్ డ్రోన్లను భారత్‌కు విక్రయించే విషయాన్ని పరిశీలిస్తున్నట్లు తరువాయి 2లో

## పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

మేడ్చల్ దిశ సమావేశంలో ఎంపీ మల్లారెడ్డి



హైదరాబాద్ : గ్రామీణాభివృద్ధికి సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మల్కాజిగిరి ఎంపీ సిహెచ్. మల్లారెడ్డి సూచించారు. మేడ్చల్ కలెక్టరేట్‌లో జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీ నిరుద్యోగ యువతకు దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్ యోజనలో భాగంగా శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని పరిశ్రమల సీఎస్‌ఆర్ నిధులతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు జరిగేలా చూడాలన్నారు. పారిశ్రామికవేత్తలను అభివృద్ధిలో భాగస్వాములను చేయాలన్నారు. బీ ప్రభుత్వ పాఠశాలల్లో బయోమెట్రిక్ విధానాన్ని ప్రవేశపెట్టేందుకు అవసరమైన యంత్రాలను సమకూర్చేందుకు సిద్ధంగా ఉన్నామని ఎంపీ తెలిపారు. బీ కలెక్టర్ డా.ఎం.వి.రెడ్డి మాట్లాడుతూ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఉద్యమంలా ముందుకు వెళ్తామన్నారు. ఈనెల 24 నుంచి మండలాల వారీగా శిబిరాలు ఏర్పాటు చేసి ఎంపిక ప్రక్రియ చేపడుతున్నట్లు తెలిపారు.బీ జిల్లాలో కొత్తగా 25 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, రెండు ఏరియా ఆస్పత్రులు, జిల్లా ఆస్పత్రి, మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. అధికారులు, సిబ్బంది పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించి ఆదర్శంగా నిలవాలన్నారు. బీ ఉప్పల్ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్‌ఎస్.ప్రభాకర్ మాట్లాడుతూ.. గత దిశ సమావేశంలో చర్చించిన అంశాలపై సమీక్షించారు.

అనంతరం వివిధ పథకాల స్థితిగతులపై చర్చించారు. సమావేశంలో జేసీ ధర్మారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ కౌటిల్యారెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.




ఇక్కడుంటేనే నీకు కష్టమేంటో తెలీదు...భారీ వర్షాలు... జిఎస్టీ బాదుడు.. బయట తట్టుకోలేవు !!

## తెలుగు ప్రజలు ఎక్కడున్నా రాణిస్తారు



దుబాయి: తెలుగు జాతి ఉన్నంత వరకు ప్రజల గుండెల్లో ఎన్టీఆర్ చిరస్థాయిగా నిలిచిపోతారని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. తెలుగు ప్రజలు ఎక్కడ ఉన్నా రాణిస్తారన్నారు. నవ్యాంధ్రలో వ్యాపారాలు చేస్తే తమ పూర్తి సహకారం ఉంటుందని తెలిపారు. ఎన్నారైలకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తుందని స్పష్టంచేశారు. దుబాయ్ లోని తెలుగువారి (నాన్ రెసిడెంట్ తెలుగూస్) సదస్సులో సీఎం ప్రసంగించారు. విదేశీ పర్యటనలో భాగంగా చంద్రబాబు దుబాయిలో పర్యటిస్తున్నారు. అమెరికా పర్యటన ముగించుకుని యూఏఈ చేరుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు బ ృందానికి అక్కడ ఘన స్వాగతం లభించింది. యూఏఈలోని భారత రాయబారి నవదీప్ సింగ్ సూరీతో సమావేశమైన సీఎం.. తన పర్యటనకు సంబంధించిన వివరాలను ఆయనతో చర్చించారు. ఆ తర్వాత దుబాయ్ నగరంలోని ఇండియన్ హైస్కూలు ఆడిటోరియంలో 'తెలుగు సమాజం'తో జరగనున్న సమావేశంలో పాల్గొని కీలకోపన్యాసం చేశారు. దుబాయ్ కంటే విశాఖ బాగుందనే ప్రశంసల పట్ల సీఎం హర్షం వ్యక్తం చేశారు. ఏపీలో సాంకేతికతను ఏవిధంగా వినియోగిస్తున్నదీ అక్కడి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమం అనంతరం బిజినెస్ లీడర్స్ తరువాయి 2లో




# ఆగమోక్తం.. కేదారగౌరీ వ్రతం

## అశేషంగా తరలివచ్చిన మహిళలు



శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయంలో దీపావళిని పురస్కరించుకుని కేదారగౌరీ వ్రతాన్ని అత్యంత ఘనంగాను, ఆగమోక్తంగాను జరిపారు. ఏటా దీపావళి పర్వదినాన ఈ విశేష పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. సౌభాగ్యాన్ని పదిలం చేయడంతో పాటు ఐశ్వర్యాన్ని వృద్ధి చేసేందుకు మహిళలు ఈ విశేష వ్రతాన్ని నోచుకుంటూ ఉంటారు. ఈ విశేష ఉత్సవాన్ని పురస్కరించుకుని ముక్కంటి ఆలయంలోని శ్రీకృష్ణదేవరాయలు నిర్మించిన శాంతి మండపంలో ఈ పూజాది కార్యక్రమాలు ఆగమోక్తంగా జరిపారు. వేకువజామునే ఈ వ్రతపూజల్లో పాల్గొనేందుకు మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అలంకార మండపం నుంచి శ్రీకేదారగౌరీ అమ్మవారికి విశేష అలంకరణలు చేపట్టి.. వేదపండితుల మంత్రోచ్చారణలతో ఉత్సవమూర్తిని అంగరంగ వైభవంగా వూరేగింపుగా శాంతి మండపానికి తీసుకువచ్చారు. అనంతరం కేదారగౌరీ వ్రతాన్ని శాస్త్ర1క్తంగా జరిపారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు జరిగిన ఈ పూజల్లో పాల్గొనేందుకు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయం తరపున దాదాపు ఐదు వేల వరకు టిక్కెట్లును విక్రయించారు. ఈ దఫా ఎలాంటి తోపులాటలు, తొక్కిసలాటలు లేకుండా కేదార గౌరీ వ్రతాన్ని విశేష రీతిలో జరిపారు. పూజలు చేయించుకున్న తరవాత భక్తులకు ఆలయం తరపున వాయినాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో భ్రమరాంబ, దీక్షాగురుకుల్ వరదగురుకుల్, ప్రధాన అర్చకులు సంబంధం, కర్ణా గురుకుల్‌తో పాటు ఆలయ ఈఈ వెంకటనారాయణ, ఏఈవోలు ఎన్.ఆర్.కృష్ణారెడ్డి, చిట్టెమ్మ, మోహన్, సూపరింటెండెంట్ హేమమాలినితో పాటు పలువురు అధికారులు, అధికారేతరులు పాల్గొన్నారు. ఈ పూజల కారణంగా ఆలయంలో రద్దీ నెలకొంది. భక్తుల సౌకర్యార్థం స్వామి, అమ్మవార్ల ఆలయాల్లో లఘు దర్శనం అమలు చేశారు.

# భూముల సమస్య పరిష్కారానికి కృషి

### - సభాపతి



నరసరావుపేట : దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న లింగంగుంట్ల భూముల సమస్య పరిష్కారం కోసం ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని సభాపతి డాక్టరు కోడెల శివప్రసాదరావు అన్నారు. లింగంగుంట్ల గ్రామ పెద్దలతో కలిసి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సభాపతి మాట్లాడారు. పుష్పగిరి పీఠాధిపతులు, గ్రామస్థుల మధ్య భూములు, నివాసగృహాలకు సంబంధించి ఎంతో కాలంగా వివాదం కొనసాగుతుందన్నారు. రైతులు, సామాన్య ప్రజలు భూములు, ఇళ్లు అమ్ముకోవడానికి, కొనుగోలు చేయటానికి వీలుపడక బ్యాంకుల నుంచి రుణాలు అందక ఇబ్బందులు పడుతున్నారన్నారు. గ్రామస్థులు సమస్య పరిష్కరించాలని కోరగా పుష్పగిరి పీఠం ప్రతినిధులతో పలుమార్లు చర్చలు జరిపామన్నారు. ఎవరికి ఇబ్బంది లేకుండా రాజీమార్గంలో పోవాల్సిన అవసరముందన్నారు. ప్రజల ప్రయోజనాలను పీఠాధిపతులు పరిగణనలోకి తీసుకోవాలన్నారు. ఈనెల 21వ తేదీ నుంచి సర్వేయర్ల బృందం లింగంగుంట్ల అగ్రహారం పరిధిలో ఉన్న వ్యవసాయ భూములు, నివాసగృహాలు, దేవాలయాలు తదితర వివరాలు సేకరిస్తుందన్నారు. లింగంగుంట్ల మాజీ సర్పంచ్ ఈశ్వరరెడ్డి మాట్లాడుతూ 50 ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యను సభాపతి పరిష్కరించేందుకు చొరవ చూపారన్నారు. సభాపతి ఎలాంటి నిర్ణయం తీసుకున్నా గ్రామస్థులమంతా కట్టుబడి ఉంటామని చెప్పారు. పీఠాధిపతులు ప్రజల సమస్యను దృష్టిలో ఉంచుకొని నామమాత్రంగా తీసుకొని సహకరించాలని కోరారు. తెదేపా మండల అధ్యక్షులు గంగుల పెద్దిరెడ్డి, గ్రామపెద్దలు నంద్యాల సత్యనారాయణరెడ్డి, యన్నం అంజిరెడ్డి, మోహన్‌రెడ్డి తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

# త్వరలో హిమాచల్‌లో భాజపా ఎన్నికల ప్రచారం

దిల్లీ: హిమాచల్‌ప్రదేశ్ ఎన్నికల్లో గెలుపొందేందుకు భాజపా ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. రానున్న ఎన్నికల కోసం ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనే వారి జాబితాను ఆదివారం భాజపా విడుదల చేసింది. ఈ జాబితాలో ప్రధాని మోదీ సహా మొత్తం 40 మంది స్టార్ క్యాంపెయినర్ల పేర్లు ఉన్నాయి. భాజపా జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా, కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అరుణ్‌జైట్లీ, సుష్మా స్వరాజ్, నితిన్ గడ్కరీతో పాటు సీఎం శివరాజ్‌సింగ్ చౌహాన్, యోగి ఆదిత్యనాథ్, మనోహర్‌లాల్ ఖట్టర్ తదితరుల పేర్లు ఈ జాబితాలో ఉన్నాయి.

నవంబరు 9న హిమాచల్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే. ఇప్పటికే 68 నియోజకవర్గాల్లో పోటీ చేసే 68 మంది అభ్యర్థుల జాబితాను భాజపా విడుదల చేసింది. అయితే.. సీఎం అభ్యర్థి ఎవరు అనే విషయాన్ని మాత్రం ప్రకటించలేదు. డిసెంబరు 18న ఓట్ల లెక్కింపు జరగనుంది.

# 22 వెలిగించిన కొవ్వొత్తులు నోట్లో పెట్టుకుని గిన్నిస్ రికార్డ్



ముంబై: గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లోకి ఎక్కేందుకు గాను ఓ వ్యక్తి ఏకంగా 22 కొవ్వొత్తులను వెలిగించి వాటిని అమాంతం నోట్లో పెట్టున్నాడు. దీంతో అతను ఆ ఫీట్ సాధించాడు. ఈ విషయాన్ని గిన్నిస్‌బుక్ ఫేస్‌బుక్ పేజీలో పోస్ట్ చేయగా, ప్రస్తుతం ఆ వ్యక్తి సాధించిన ఈ ఫీట్ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ముంబైకి చెందిన దినేష్ ఉపాధ్యాయ స్థానికంగా స్కూల్ టీచర్‌గా పనిచేస్తున్నాడు. ఇతను 22 కొవ్వొత్తులను వెలిగించి వాటిని అమాంతం నోట్లో పెట్టుకున్నాడు. దీంతో అతన్ని గిన్నిస్ రికార్డ్ వరించింది. ఈ విషయాన్ని గిన్నిస్ వారు తమ ఫేస్‌బుక్ అఫిషియల్ పేజీలో షేర్ చేశారు. దీంతో దినేష్ ఉపాధ్యాయ సాధించిన ఈ ఫీట్ వీడియో వైరల్ అయింది. అయితే నిజానికి దినేష్‌కు గిన్నిస్ సాధించడం ఇది కొత్త కాదు. గతంలో 89 గిన్నిస్ వరల్డ్ రికార్డులను, 57 లిమ్కా బుక్ రికార్డులను, 3 రిప్లీస్ వరల్డ్ రికార్డులను దినేష్ సాధించాడు. ఒక నిమిషంలో 73 ద్రాక్ష పండ్లను తిని ఒక రికార్డును సాధించగా, 10 బిలియర్డ్ బాల్స్‌ను ఒకే చేతిలో పట్టుకుని మరో ఫీట్ సాధించాడు. ఇక తాజాగా సాధించిన కొవ్వొత్తుల ఫీట్ వీడియోను ఇప్పటి వరకు దాదాపుగా 3.83 లక్షల మంది వీక్షించారు.

# చౌక దుకాణాల్లో తొమ్మిది రకాల సరకులివ్వాలి

గుంటూరు : చౌకధరల దుకాణాల్లో గతంలో మాదిరిగానే 9 రకాల నిత్యవసర వస్తువుల సరఫరాను పునరుద్ధరించాలని వైకాపా నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈసందర్భంగా గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ గత ప్రభుత్వం కిరోసిన్‌తో కలిపి 9 రకాల వస్తువులను పంపిణీ చేసిందని, తెదేపా బియ్యం ఒక్కటి పంపిణీ చేసేందుకు విలవిల్లాడుతుందన్నారు. పేద ప్రజలకు కడుపునిండా అన్నం పెట్టలేకపోతున్నారని, ఎన్నికలకు ముందు చేసిన హామీలను తుంగలో తొక్కి మోసం చేశారన్నారు. రానున్న ఎన్నికల్లో ఈ ప్రభుత్వానికి ప్రజలు సరైన బుద్ధి చెబుతారన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ చౌకధరల దుకాణాల వ్యవస్థను నిర్వీర్యం చేసి కార్పొరేట్ కంపెనీలకు అప్పజెప్పాలని చూస్తే సహించేది లేదన్నారు. పేదలు పండగ పూట పస్తులుంటే పట్టని ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతిని సింగపూర్‌లా మారుస్తానంటే నమ్మే పరిస్థితి ఏమాత్రం లేదని చెప్పారు. ఇప్పటికైనా చౌకధరల దుకాణాల్లో 9 రకాల నిత్యవసరాలను పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం కలెక్టరేట్‌లోని జేసీ-2 ముంగా వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ధర్నాలో దళిత విభాగం రాష్ట్ర అధ్యక్షుడు మేరుగ నాగార్జున, రాష్ట్ర కార్యదర్శులు రాతంశెట్టి సీతారామాంజ నేయులు, కిలారి వెంకటరోశయ్య, ఈచంపాటి వెంకటకృష్ణ, లక్కాకుల థామస్‌నాయుడు, గులాం రసూల్, నాయకులు అత్తోట జోసఫ్, మేడా సాంబశివరావు, సోమికమల్, మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఎలికా శ్రీకాంత్, దాసరి కిరణ్, అర్జున్, పానుగంటి చైతన్య తదితరులు పాల్గొన్నారు.

# చంద్రునిపై భారీ గుహ

టోక్యో: చంద్రునిపై నివాసం కోసం మనిషి కంటున్న కలలు నెరవేరే సూచనలు కనిపిస్తున్నాయి. చంద్రునిపై నివాసయోగ్యమైన ఓ భారీ గుహను జపాన్ అంతరిక్ష పరిశోధకులు కనుగొన్నారు. మనిషి నివసించడానికి వీలుకాని ప్రమాదకరమైన రేడియేషన్, ఉష్ణోగ్రతల మార్పుల నుంచి ఈ గుహ రక్షణ కల్పించనుంది. చంద్రునిపై కాలుమోపే వ్యోమగాములకు ఈ గుహ ఆవాసంగా మారే అవకాశాలు ఉన్నాయని భావిస్తున్నారు. సెలెన్ లూనార్ ఆర్బిటర్ నుంచి సేకరించిన సమాచారాన్ని జపాన్ అంతరిక్ష పరిశోధనాసంస్థ విశ్లేషించగా ఈ విషయం వెలుగు చూసింది. చంద్రుడిపై మారియస్ హిల్స్ అనే ప్రాంతంలో 50 కిలోమీటర్ల పొడవు, వందమీటర్ల వెడల్పుతో ఈ భూగర్భ గుహ ఉందని గుర్తించారు. 350 కోట్ల సంవత్సరాలక్రితం చంద్రుడిపై అగ్నిపర్వతాల విస్ఫోటనంతో వెల్లువెత్తిన లావా ప్రవాహం కారణంగా ట్యూబ్ తరహాలో ఇది ఏర్పడి ఉండవచ్చని భావిస్తున్నారు. ఈ పరిశోధనకు సంబంధించిన వివరాలను జియోఫిజికల్ రీసెర్చ్ లెటర్స్ అనే అమెరికన్ సైన్స్ మ్యాగజైన్ ప్రచురించింది. చంద్రుడిపై ఇప్పటివరకు జరిగిన పరిశోధనల్లో ఇది గొప్ప ముందడుగుగా భావిస్తున్నారు. ఆ గుహలో ఏమున్నదో తెలీదు. ఒకవేళ దానిలోకి తొంగి చూడగలిగితే మరిన్ని ఆసక్తికరమైన విషయాలు తెలుస్తాయి అని జపాన్ ఖగోళ అధ్యయన విభాగం పరిశోధకుడు జునిచి హరుయమ తెలిపారు. 2030 కల్లా చంద్రుడిపైకి తమ వ్యోమగాముల్ని పంపడమే లక్ష్యంగా జపాన్ ప్రయత్నిస్తున్న నేపథ్యంలో ఈ పరిశోధన వెలుగులోకి వచ్చింది.



### మొదటి పేజీ తరువాయి

# ప్రజల్లో పెరిగిన నమ్మకం నిలబెట్టుకోవాలి

ఆపరేషన్ల గండం నుంచి బయటపడుతున్నారు. నిరంతరం వైద్యశాలకు వచ్చి చెక్ చేసుకోవటం వల్ల తల్లి, బిడ్డ ఆరోగ్యంగా ఉంటున్నారు. ఫలితంగా ఆరోగ్యవంతమైన

మరో తరం (జనరేషన్) వస్తున్నది. పేదలకు ప్రసూతి ఖర్చు తప్పడమే కాకుండా, తిరిగి ప్రభుత్వమే రూ. 15 వేల దాకా ప్రోత్సాహకం అందిస్తున్నది. పేదలు ప్రభుత్వాన్ని దీవిస్తున్నారు. గర్భవతులు ముందే దవాఖానకు వచ్చి పరీక్షలు చేయించుకోవటం, ప్రసూతి చేయించుకోవటం వల్ల మాతా శిశు మరణాలు గణనీయంగా తగ్గాయి. కేసీఆర్ కిట్స్ వల్ల పెరిగిన పేషెంట్ల రద్దీకి తగినట్లుగా వసతులు కూడా పెంచాలి. అవసరమైన వైద్యులను, సిబ్బందిని నియమించుకోవాలి. వైద్య ఆరోగ్యశాఖకు అవసరమైన నిధులను ఆర్థికశాఖ ఎలాంటి జాప్యం లేకుండా విడుదల చేయాలి అని సీఎం చెప్పారు. ఆదిలాబాద్‌తోపాటు ఇతర ఏజెన్సీలలో ప్రతి వర్షాకాలంలో అంటువ్యాధులు, విషజ్వరాలు ప్రబలి అనేకమంది చనిపోయేవారని, కానీ ఈసారి వైద్య ఆరోగ్యశాఖ చేపట్టిన కార్యక్రమాల వల్ల అలాంటి పరిస్థితి రాలేదంటూ వైద్యుల పనితీరును ముఖ్యమంత్రి మెచ్చుకున్నారు.

## రో రో ఫెర్రీ దేశంలో మొట్టమొదటి ప్రాజెక్టు

కల నెరవేరిందని తెలిపారు. ఈ ఫెర్రీ సర్వీసును కేవలం ఒక మార్గానికే పరిమితం చేయబోమని చెప్పారు. హజీరా, పిపవవ్, జఫరాబాద్, డమన్-డయ్యూలతో ఘోఘా-దహేజ్ మార్గాన్ని అనుసంధానం చేస్తామని చెప్పారు. రో రో ఫెర్రీ సర్వీసు ఘోఘా-దహేజ్ పట్టణాలను మరింత చేరువ చేసిందని మోదీ అన్నారు. ఫెర్రీ ప్రయాణం వల్ల ఈ రెండు పట్టణాల మధ్య ప్రయాణ కాలం గంటన్నరకు తగ్గుతుందన్నారు. నదులు, సముద్ర వాణిజ్యాలకు ఎంతో ప్రాధాన్యం ఉన్నట్లు మానవ నాగరికత, చరిత్ర వివరిస్తున్నాయన్నారు. గుజరాత్‌లో అనేక ప్రముఖ పట్టణాలు ఉన్నాయన్నారు. ఈ చారిత్రకాంశాలను ఎలా మరచిపోగలమని ప్రశ్నించారు. గుజరాత్ ప్రకాశవంతమైన గతాన్ని పునరుజ్జీవింపజేయడం, సౌరాష్ట్ర, దక్షిణ గుజరాత్‌లను అనుసంధానం చేయడమే ఈ కార్యక్రమం లక్ష్యమని తెలిపారు. ఫెర్రీని వినియోగించడం వల్ల సమయం, పెట్రోలు ఎంత ఆదా అవుతాయో ఊహించండి అని మోదీ అన్నారు. తాను గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నపుడు ఈ ప్రాజెక్టుకు అనుమతులు మంజూరు చేశానన్నారు. నవ భారత నిర్మాణం కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు.

గత రెండు దశాబ్దాలుగా గుజరాతీలు ప్రాధాన్యమిస్తున్న పాడి పరిశ్రమ ప్రాజెక్టును కూడా ప్రారంభించడం సంతోషంగా ఉందని చెప్పారు. పశు పోషణలో నూతన అవకాశాలను అన్వేషించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. పాల ఉత్పత్తి పెరిగితే, ఆరోగ్య సమస్యల పరిష్కారం సాధ్యమవుతుందని చెప్పారు.

యూపీఏ ప్రభుత్వం గుజరాత్‌లో అనేక ప్రాజెక్టులను నిలిపేసిందని మోదీ ఆరోపించారు. తాను ముఖ్యమంత్రిగా ఉన్నపుడు అప్పటి కేంద్ర ప్రభుత్వం నుంచి తనకు ప్రతికూలత ఎదురైందన్నారు. పరిశ్రమలను, రాష్ట్రాభివృద్ధిని అడ్డుకునేందుకు అప్పట్లో తీవ్ర ప్రయత్నాలు జరిగాయన్నారు. మూడేళ్ళ నుంచి తమ ప్రభుత్వం ఆ పరిస్థితిని మార్చిందన్నారు. ఆ విధానాలను మార్చి, గుజరాత్ అభివృద్ధికి ప్రాధాన్యమిస్తున్నామని తెలిపారు. రవాణా రంగంలో కోటి ఉద్యోగాలను సృష్టిస్తామని చెప్పారు. రవాణా రంగాన్ని సమీకృతపరచి, అత్యాధునికంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని చెప్పారు.

## తెలుగు ప్రజలు ఎక్కడున్నా రాణిస్తారు

ఫోరమ్ సమావేశంలో పాల్గొన్నారు. అక్కడ ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకు గల అవకాశాలపై దుబాయ్ పారిశ్రామిక, వాణిజ్య ప్రముఖులకు వివరించనున్నారు.

## భారత్ అమ్ముల పొదిలో మరిన్ని అస్త్రాలు

అమెరికా రక్షణ శాఖ ప్రకటించింది.

భారత్-ఫ్రాన్స్ దౌత్య సంబంధాలను మరింత బలోపేతం చేసే దిశగా ఫ్రాన్స్ అడుగులు వేస్తోంది. అందులో భాగంగా ఫ్రాన్స్ రక్షణ శాఖమంత్రి ఫ్లోరున్స్ పార్లే వచ్చే వారంలో భారత్‌లో పర్యటించనున్నారు. గత ఏడాది 36 రాఫెల్ విమానాలను భారత్‌కు విక్రయించేందుకు ఫ్రాన్స్ అంగీకరించింది. ఈ 36 యుద్ధవిమానాలను భారత్ రూ. 59 వేల కోట్లతో కొనుగోలు చేస్తోంది. ఈ నేపథ్యంలో మరో 36 రాఫెల్ యుద్ధ విమానాలను కొనుగోలు చేసేందుకు భారత్ ఆసక్తిని చూపింది. ఈ నేపథ్యంలోనే భారత్‌కు వస్తున్న ఫ్రాన్స్ రక్షణ శాఖ మంత్రి భారత రక్షణ మంత్రి నిర్మలా సీతారమన్, ఇతర రక్షణ శాఖ ఉన్నతాధికారులతో సమావేశమవుతారు. సీమాంతర ఉగ్రవాదం ఇతర అంశాలపై ప్రధాని నరేంద్ర మోదీతో ఆయన చర్చిస్తారు. ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌ను బలోపేతం చేసే దిశగా ఆర్మ్‌డ్ డ్రోన్లను అందించాలని భారత్ గతంలో అమెరికాను కోరింది. భారత ప్రభుత్వం ఆర్మ్‌డ్ డ్రోన్లపై కనబరిచిన ఆసక్తిని ట్రంప్ అడ్మినిస్ట్రేషన్ తాజాగా పరిశీలిస్తోందని అమెరికా ఉన్నతాధికారి ఒకరు ప్రకటించారు. ఆర్మ్‌డ్ డ్రోన్లు రక్షణ శాఖలో చేరితో.. భారత వాయుదళం మరింత శక్తివంతం అవుతుందనడంలో ఎటువంటి సందేహం లేదని ఆయన చెప్పారు. ఆర్మ్‌డ్ డ్రోన్లుగా పిలిచే అవేంజర్ ఎయిర్ క్రాఫ్ట్‌ల కొనుగోలనుకు సంబంధించి భారత్ ఈ ఏడాది అమెరికాకు లేఖ రాసింది. సుమారు 100 ఆర్మ్‌డ్ డ్రోన్లును విక్రయించాలని అందులో భారత్ కోరిందని అమెరికా ఉన్నతాధికారి తెలిపారు. ఈ ఏడాది జూన్ 26న వైట్ హౌస్‌లో ప్రధాని నరేంద్ర మోదీ, అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మధ్య జరిగిన రక్షణ ఒప్పందాల్లో భాగంగా.. 22 గార్డియన్ డ్రోన్లకు భారత్‌కు విక్రయించేందుకు అమెరికా అంగీకరించిన విషయం తెలిసిందే.

# మరుగుదొడ్ల నిర్మాణంలో పురోగతి చూపించాలి

### - కలెక్టర్ ప్రద్యుమ్న



చిత్తూరు : మరుగుదొడ్ల నిర్మాణంలో ప్రగతి సాధించాల్సిందే. రాష్ట్రంలో మిగిలిన జిల్లాలతో పోలిస్తే మనం చాలా వెనకబడి ఉన్నాం. దీనిపై కుంటిసాకులతో తప్పించుకోవాలని చూడొద్దు. అనుకున్న ప్రణాళిక ప్రకారం నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేయడానికి శ్రమించాలని జిల్లా పాలనాధికారి పీఎస్ ప్రద్యుమ్న తేల్చిచెప్పారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు జిల్లాలోని నియోజకవర్గాల వారీగా అన్ని నియోజకవర్గ, మండలాల ప్రత్యేక అధికారులు, ఇన్‌ఛార్జి క్షేత్రస్థాయి అధికారులతో వీడియో సమావేశం నిర్వహించారు. ప్రతి మండలంలోని మరుగుదొడ్ల నిర్మాణాలు సాగుతున్న తీరుపై సమీక్షించారు. మరుగుదొడ్ల నిర్మాణాన్ని ప్రతిష్మాత్మకంగా చేపడుతున్నాం. ముందే ప్రణాళిక రూపొందించాం. రోజువారీ, నెల వారీ లక్ష్యాలను నిర్దేశించాం. లక్ష్యం మేరకు పనులు చేస్తామని మీరే చెప్పారు. ఇప్పుడేమో సాకులు చెప్తారా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలో 27 మండలాల్లో మరుగుదొడ్ల నిర్మాణాలు నత్తనడకన సాగుతుండడం పై ఆయా అధికారులపై తీవ్రంగా ఆగ్రహించారు. రొంపిచర్ల, గుర్రంకొండ, పూతలపట్టు, తంబళ్లపల్లె, పీటీఎం, ములకలచెరువు, చిన్నగొట్టిగల్లు మండలాల ఇన్‌ఛార్జి అధికారులు, ప్రత్యేక అధికారులను మందలించారు. మరుగుదొడ్ల నిర్మాణాల్లో క్షేత్రాస్థాయిలో అధికారులు ఎంత మేరకు పాల్గొం టున్నారు? ఇన్‌ఛార్జి అధికారులు క్షేత్రస్థాయికి వస్తున్నారా లేదా? వంటి విషయాలను రోజువారీగా నివేదించాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా అక్టోబరు నెలకు నిర్దేశించిన లక్ష్యాన్ని 25వ తేదీకి పూర్తి చేయాలని ఆదేశించారు.

అనంతరం పంచాయతీల్లో చేపట్టిన బృందావనం పనులు, నీరు-ప్రగతి, వనం-మనం, ఉద్యానవనం, పంటసంజీవని అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. ఇదే అంశాలపై త్వరలోనే నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తా మన్నారు. సమావేశంలో జేసీ-2 చంద్రమౌళి, సీపీవో భాస్కరశర్మ, వ్యవసాయ శాఖ జేడీ విజయకుమార్, డీఆర్‌డీఏ పీడీ రవిప్రకాష్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ వేణు పాల్గొన్నారు.

# హైదరాబాద్ ప్రాంతీయ వార్తలు

## పూనే - కాజీపేట్ రైలుకు అపూర్వ స్వాగతం

బల్లార్ష : దీర్ఘ కాలంగా చంద్రపూర్, గడ్చిరోలి, యావత్‌మాల్ జిల్లావాసులతో పాటు తెలంగాణ ప్రాంతవాసులు ఎదురు చూస్తున్న పూనే-కాజీపేట్ ఎక్స్‌ప్రెస్ రైలుకు చంద్రపూర్, బల్లార్షలలో ఘన స్వాగతం లభించింది. చంద్రపూర్ రైల్వే స్టేషన్‌కు వచ్చిన వెంటనే కేంద్ర మంత్రి హన్సరాజ్ ఆహిర్‌తో పాటు జిల్లా వాసులు భారీ సంఖ్యలో పచ్చ జెండాలతో స్వాగతం పలికారు. రైల్వే డ్రైవర్‌కు పుష్పగుచ్ఛాలతో ఆహ్వానం పలికారు. అనంతరం కేంద్ర మంత్రితో పాటు పలువురు ఇదే రైలులో చంద్రపూర్ నుంచి బల్లార్ష వరకు ప్రయాణించారు. బల్లార్ష రైల్వే స్టేషన్‌లో రైల్వే ప్రవాస మండలి అధ్యక్షులు శ్రీనివాస్ సుంచువార్ ఆధ్వర్యంలోని పట్టణవాసులు ఘన స్వాగతం పలికారు. అనంతరం బల్లార్ష రైల్వే స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో కేంద్ర మంత్రి ఆహిర్ మాట్లాడారు. ప్రస్తుతం వారానికి ఓ రోజు నడుస్తున్న పూనే-కాజీపేట్ రైలును మూడు రోజులకు పెంచేలా ప్రయత్నిస్తానని తెలిపారు. ప్రయాణికుల రద్దీని బట్టి ప్రస్తుతం ఉన్న 12 కోచ్‌ల స్థానంలో 18 కోచ్‌లు ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు.

## గిరిజన పండగలకు రాష్ట్ర స్థాయిలో గుర్తింపు



ఆదిలాబాద్ : సంప్రదాయాలకు చిహ్నంగా నిర్వహించుకునే గిరిజన పండగలకు రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక గుర్తింపు లభించేలా కృషి చేస్తానని మంత్రి జోగు రామన్న అన్నారు. ఆదిలాబాద్ మండలంలోని అంకోలి, చించుఘాట్, లోకారి పంచాయతీల్లో జరిగిన దండారీ వేడుకల్లో మంత్రి పాల్గొన్నారు. తొలుత గుస్సాడీలతో కలిసి నృత్యాలు చేశారు. అనంతరం గ్రామస్థులతో కలిసి వేడుకలను తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదిలాబాద్ నియోజకవర్గంలో కుమురం భీం, సూరు విగ్రహాల ఏర్పాటుకు కృషి చేస్తానని హామీచ్చారు. తెరాస ప్రభుత్వం గిరిజనుల కోరిక మేరకు ఆసిఫాబాద్ జిల్లాకు కుమురం భీం పేరు పెట్టిందన్నారు. కుమురం భీం పోరాట పటిమను గుర్తించిన ప్రభుత్వం జొడేఘాట్‌లో మ్యూజియం ఏర్పాటు చేసిందన్నారు. మంత్రి వెంట జడ్పీటీసీ సభ్యుడు అశోక్, వైస్ ఎంపీపీ గంగారెడ్డి, మార్కెట్ కమిటీ ఉపాధ్యాక్షుడు గంగయ్య, ఐసీడీఎస్ ఆర్గనైజర్ కస్తాల ప్రేమల, తెరాస మండల అధ్యక్షుడు స్వామి, అంకోలి ఎంపీటీసీ రమణ, తెరాస నాయకులు నైతం శుక్లాల్, తదితరులు పాల్గొన్నారు.

## పత్తి రైతులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు: జేసీ



కొత్తగూడెం : పత్తి విక్రయాల్లో వ్యాపారులు సిండికేట్‌గా మారి రైతులను ఇబ్బందులకు గురి చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే లైసెన్సులను రద్దు చేస్తామని జిల్లా సంయుక్త కలెక్టర్ రాంకిషన్ హెచ్చరించారు. లక్ష్మీదేవిపల్లిలోని జిల్లా వ్యవసాయ మార్కెట్ యార్డులో లైసెన్స్ ట్రేడర్స్‌తో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతుల ఉత్పత్తులకు సరైన ధరలను కల్పించకుండా మోసం చేసే దళారీ వ్యవస్థపై చర్యలు తీసుకుంటామని వారిపై క్రిమినల్ చర్యలు తీసుకునేందుకు వెనుకాడబోమన్నారు. విక్రయాల్లో వాస్తవాలు వెల్లడించాలన్నారు. సమస్యలుంటే చర్చించి పరిష్కారిస్తామన్నారు. ఎలక్ట్రానిక్ కాంటాలను ఏర్పాటు చేయాలని, చెక్‌పోస్టుల వద్ద ఇబ్బందులు తొలగించాలని సూచించారు. రైతు బాగుంటేనే దేశం బాగుంటుందని దేశానికి రైతే వెన్నుముక అన్నారు. రైతుల ఉత్పత్తులను మార్కెట్‌కు తెచ్చేలా ప్రోత్సాహించే వ్యాపారులకే మనుగడ కొనసాగుతుందని, లైసెన్సులను అన్‌లైన్ చేస్తున్నామని రైతు సంక్షేమం కోసం ఉత్పత్తులను మద్దతు ధరకు విక్రయించేందుకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

సమావేశంలో జిల్లా మార్కెటింగ్ అధికారి నరేందర్, కార్యదర్శి నిర్మల, వ్యాపారి జుగల్ కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్ తరలింపుపై ప్రజా బ్యాలెట్

ఖమ్మం : ఖమ్మం కలెక్టరేట్‌ను దూరప్రాంతానికి తరలిస్తున్న నేపథ్యంలో ఈనెల 23న వామపక్షాలు, విప్లవపార్టీలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే ప్రజాబ్యాలెట్‌ను నిర్వహిస్తున్నట్లు అఖిలపక్ష నాయకులు తెలిపారు. నగరంలోని సుందరయ్యభవన్‌లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రజాబ్యాలెట్ కార్యక్రమంలో ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈనెల 31న మంత్రి కార్యాలయం ముట్టడి ఉంటుందని తెలిపారు. సమావేశంలో నాయకులు జానిమియా, ఆవుల వెంకటేశ్వర్లు, బుగ్గవీటి సరళ, శ్రీకాంత్, విక్రమ్, అశోక్, వెంకటేశ్వర్లు, మల్సూర్, కృష్ణ, విష్ణు, నాగరాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## రూ.377 కోట్లతో సీతారామ ప్రాజెక్టు కాలువ పనులు

జూలూరుపాడు : ఎనిమిదో ప్యాకేజీ కింద చేపడుతున్న సీతారామ ప్రాజెక్టు కాలువ నిర్మాణ కోసం ప్రభుత్వం రూ.377 కోట్లు కేటాయించినట్లు డీఈలు సీహెచ్ రామకృష్ణ, కె.రాందాస్ పేర్కొన్నారు. జూలూరుపాడు సమీపంలో కాలువ కింద కోల్పోనున్న భూములను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈలు విలేకరులతో మాట్లాడుతూ 31.5 కి.మీ. పొడవునా కాలువ నిర్మాణం జరగనుందన్నారు. చంద్రుగొండ మండలం బెండాల పాడు, పోకలగూడెం, జూలూరుపాడు మండలంలోని నల్లబండ బోడు, గుండెపూడి, జూలూరుపాడు, పాపకొల్లు, కారేపల్లి మండలంలోని చీమలపాడు, రేలకాయల పల్లి మీదుగా కాలువ తవ్వకం చేపట్టనున్నట్లు చెప్పారు. కారేపల్లి- జూలూరుపాడు మధ్య గుట్టలను తొలచే పనులు జరుగుతాయన్నారు. పట్టా భూములు కోల్పోతున్న రైతులకు ప్రభుత్వం పరిహారం ఇవ్వనుందన్నారు. బెండాలపాడు, పోకలగూడెం, నల్లబండబోడు గ్రామాల్లో ఎంజాయి మెంట్ సర్వే పూర్తయినట్లు తెలిపారు. మొత్తం 301 హెక్టార్లలో భూమిని సేకరించనున్నట్లు తెలిపారు. వచ్చే నెల నుంచి పనులు ప్రారంభం కానున్నట్లు చెప్పారు. పూర్తిస్థాయిలో భూసేకరణ చేపట్టాల్సి ఉందన్నారు. పనులు వేగవంతం చేస్తున్నట్లు డీఈలు చెప్పారు.

## డిజిటల్ అక్షరాస్యతపై అవగాహన పెంచాలి

పాలనాప్రాంగణం : ప్రస్తుత పోటీప్రపంచంలో డిజిటల్ ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన పెంచాలని సంయుక్త పాలనాధి కారి కె.కృష్ణారెడ్డి పేర్కొన్నారు. పాలనాప్రాంగణ సమావేశమందిరం లో మీసేవ నిర్వాహకులు, సీఎస్‌సీ(కామన్‌సర్వీస్‌సెంటర్) ఆపరేటర్లతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో 14 నుంచి 60 ఏళ్ల వయస్సు కలిగిన వారందరిని డిజిటల్ అక్షరాస్యులుగా మార్చేందుకు కృషిచేయాలన్నారు. ఇంటికొకరి చొప్పున ఆయా కేంద్రాలకు పిలిపించి అంతర్జాల వ్యవస్థపై అవగాహన కలిగించి గూగుల్ ఎలా తెరవాలి? మెయిల్స్ ఏలా చూడాలి?ఆయా పరీక్షలకు ఆన్‌లైన్‌లో ఎలా దరఖాస్తు చేసుకోవాలన్న అంశాలపై ఉచితంగా శిక్షణ ఇవ్వాలని పేర్కొన్నారు. ఆయా అంశాల్లో పరీక్ష నిర్వహించి ధ్రువపత్రాలు కూడా అందించాలన్నారు. డిజిటల్ అక్షరాస్యులైతే వారు ఇంటి వద్ద నుంచి తమకు అవసరమైన వాటిని చరవాణి ద్వారా కొనుగోలు చేసుకుంటారని, పోటీపరీక్షలకు, ఇతర వాటికి సొంతంగా అంతర్జాలంలో దరఖాస్తు చేసుకోగలుతారని అభిప్రాయపడ్డారు.

జవహర్ నవోదయ విద్యాలయ అధికారి డా.రామయ్య మాట్లాడుతూ ఈసారి ఆరోతరగతిలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లోనే దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. సమీక్షలో ఈసేవ జిల్లా మేనేజర్ బండివార్ రవి, మీసేవ విభాగ పర్యవేక్షకులు ప్రభాకర్‌స్వామి, ఈ సేవ కో-ఆర్డినేటర్ రఘువీర్‌సింగ్, దిశా కార్యక్రమ జిల్లా సమన్వయకర్త ఓసావార్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## విజ్ఞానశాస్త్రం మానవాళి సంక్షేమానికి ఉపయోగపడాలి: జేసీ రాంకిషన్



పాల్వంచ : విజ్ఞానశాస్త్రం తరగతి గదుల బోధనకు పరిమితం కాకూడదని, విశ్వశాంతి, మానవాళి సంక్షేమానికి ఉపయోగపడే విధంగా పరిశోధనలు సాగాలని జిల్లా సంయుక్త కలెక్టర్ రాంకిషన్ అన్నారు. పాల్వంచ బాలుర ఆశ్రమ పాఠశాలలో 25వ జాతీయ బాలల సైన్సు కాంగ్రెస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సైన్సు అధికారి చలపతిరాజు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సదస్సులో జేసీ రాంకిషన్ మాట్లాడారు. శాస్త్రవేత్తలందరూ అతి సాధారణంగా చదివినప్పటికీ, ఎంతో కష్టపడి పరిశోధనలు చేసి కొత్త విషయాలను కనుగొన్నా రన్నారు. వారి కృషి ఫలితంగా సాధించిన ప్రకృతి ఫలాలు నేటి సమాజానికి ఉపయోగపడు తున్నాయని తెలిపారు. ప్రకృతిలోని అన్ని జీవులు తమ తమ స్థాయిలో శక్తి వంచన లేకుండా పని చేస్తున్నాయని చెప్పారు. వాస్తవ విషయాలను, పరిసరాలలో జరిగే మార్పుల గురించి తెలియజేసేది విజ్ఞానశాస్త్రమని అన్నారు. చిన్నతనం నుంచే విజ్ఞానశాస్త్రం పట్ల అభిరుచి కలిగి ఉన్నప్పుడే భవిష్యత్తులో శాస్త్రవేత్తలుగా ఎదగడానికి ఉపకరిస్తుందని సూచించారు. అనంతరం జేసీ విద్యార్థులు చేసిన ప్రాజెక్టు వివరాలను తెలుసుకున్నారు.

సుస్థిరాభివృద్ధికి విజ్ఞానశాస్త్రం, సాంకేతికత, నూతన ఆవిష్కరణ, దివ్యాంగుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి అంశంపై పోటీలు జరిగాయి. ఈ కార్యక్రమానికి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు హాజరై తమ ఆవిష్కరణలను ప్రదర్శించారు. కార్యక్రమంలో జిల్లా బాలల సైన్స్ సమన్వయకర్త భూక్యా సంపత్, ఏడీ గమ్మాన్వేల్, ఏటీడీవో లక్ష్మణ్‌బాబు, పాఠశాల ప్రధానో పాధ్యాయుడు బుచ్చిరాములు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా బంగారు తులసి పూజలు

భద్రాచలం : భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారి కోవెలలో ప్రత్యేక పూజలు జరిగాయి. బంగారు తులసీ దళాలను స్వామివారి పాదాల వద్ద ఉంచి అర్చన చేశారు. నామాలను పఠించిన అర్చకులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. సుప్రభాతం పలికి ఆరాధన చేసి దర్శనాలు కల్పించడంతో భక్తులు దేవదేవున్ని తనివితీరా వీక్షించి తరించారు. తమకు కలిగిన ఆనందానికి ముగ్ధులై జైశ్రీరాం అంటూ నీరాజనాలు అందించి మొక్కుల్లో భాగంగా కానుకలను సమర్పించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. క్షేత్ర విశిష్టతపై సాగిన ప్రవచనం ఆకట్టుకుంది. వైష్ణవ సంప్రదా యం ప్రకారం విష్వక్సేన పూజ నిర్వహించి పుణ్యాహ వాచనం చేసి ప్రవరను పఠించారు. నిత్య కల్యాణ క్రతువు గురించి వివరిస్తు మంత్రోచ్ఛారణలకు అనుగుణంగా వేడుకను జరిపారు. సీతమ్మకు యోక్త్రధారణ చేసి రామయ్యకు యజ్ఞోపవీత ధారణ నిర్వహించి సమస్త మంగళ వాయిద్యాలు మార్మోగుతుండగా మాంగళ్యధారణ జరిపారు. తలంబ్రాల వేడుక పరమానందం కలిగించగా దర్బారు సేవ మంత్రముగ్ధులను చేసింది. యాగశాలలో సంక్షిప్త రామాయణ హవనం ఘనంగా జరిగింది. నేడు అభిషేకంతో పాటు బంగారు పుష్పార్చన ఉంటుందని ప్రధానార్చకులు జగన్నాథా చార్యులు తెలిపారు. మనవాళ్ల మహాముని తిరునక్షత్రోత్సవ పూజలు ఐదు రోజుల పాటు ఉంటాయన్నారు. ఇందులో తొలి రోజున భద్రుడి మండపంలో తిరుమంజనం చేశారు. చుట్టుసేవ చేసి అంతరాలయంలో దివ్య ప్రబంధాన్ని పారాయణం చేశారు. మంగళశాసనం చేసి గోష్ఠి జరిపారు.

## కేసీఆర్‌ను గద్దె దించేందుకే పోరు బాట - కూనంనేని

కొత్తగూడెం : ముఖ్యమంత్రి కేసీఆర్‌ను గద్దె దించేందుకే సీపీఐ రాష్ట్ర వ్యాప్తంగా పోరు బాట కార్యక్రమాన్ని చేపట్టిందని ఆ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పేర్కొన్నా రు. నియోజకవర్గంలో నవంబరు 2, 3 తేదీల్లో పోరు బాట కార్యక్రమం జరగనున్న నేపథ్యంలో ఆయన పార్టీ శ్రేణులతో కలిసి పట్టణం, రామవరం ప్రాంతాల్లో ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా కూలీలైన్, మేదరిబస్తీ, గొల్లగూడెం, లెనిన్‌నగర్, పెద్దబజార్, మున్సిపల్ అడ్డా, హమాలీ కార్మిక అడ్డాలు, బూడిదగడ్డ, హను మాన్ బస్తీ, పాతకొత్తగూడెం, గంగాబిషన్‌బస్తీ, రామవరంలోని ఆరు వార్డుల్లో జీపులో పర్యటిం చి పలు చోట్ల ప్రసంగించారు. కేవలం హామీలు, మాయమాటలతో ప్రజలను మభ్యపెట్టి అధి కారంలోకి వచ్చిన కేసీఆర్‌ను గద్దె దింపేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు కొనసాగుతున్న విషయాన్ని గుర్తు చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఒంటెద్దు పోకడకు చరమగీతం పాడాల్సిన అవసరం ఉందన్నారు. అట్టడుగు పేదల ఆర్థిక అభివృద్ధి కోసం సీపీఐ పోరాడుతుం దన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా మాట్లాడుతూ.. దశాబ్దాలుగా పట్టణంలో నివాస ముంటున్న స్థానికులు ఇప్పటివరకు క్రమబద్ధీ కరణకు నోచుకోకపోవడం శోచనీయమన్నారు. నాడు పారిశ్రామికంగా ఎదిగిన రామవరం ప్రాంతం నేడు వెలవెలబోతోందన్నారు. రామ వరం ప్రాంతంలో సుమారు 20 వేల కుటుం బాలు పొజిషన్ సర్టిఫికెట్ల కోసం ఎదురుచూ స్తున్నాయన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకు లు వై.శ్రీనివాసరెడ్డి, సలిగంటి శ్రీనివాస్, చంద్రగిరి శ్రీను, కంచర్ల జమలయ్య, గెద్దాడి నగేశ్, పెయ్యాల రంగారావు, మునిగడప వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ అభివృద్ధి పనులపై కలెక్టర్ సమాలోచనలు

అదిలాబాద్ : రామాలయం అభివృద్ధి పనులకు అవసరమైన భూములను సేకరించేందుకు రెవెన్యూ సిబ్బంది ఎలాంటి చర్యలు తీసుకుంటుందో కలెక్టర్ రాజీవ్‌గాంధీ పరిశీలించారు. ఐటీడీఏకు వచ్చిన ఈయన సంబంధిత అధికారులతో సమాలోచనలు చేశారు. ఆలయం చుట్టుపక్కల కొంత ప్రభుత్వ భూమి ఉందని నిర్ధారించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అవసరానికి మించిన స్థలాలు ఉన్నందున వీటిపై సర్వే జరుగుతుంది. దాదాపు 60 ఎకరాలు అవసరమని ఒక అంచనాకు వచ్చారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో ఆలయం చుట్టుపక్కల సుమారు 250 ఇళ్లను తొలగించే అవకాశం ఉన్నట్లు తెలిసింది. ఎంత కుదించినా 230 గృహా3లను కూల్చాల్సి వస్తుందని సమాచారం. ముందు కచ్చితమైన వివరాలతో అభివృద్ధి ప్రణాళిక ఉండాలనేది ప్రభుత్వ ఉద్దేశం. రంగనాయకులగుట్టపై కొన్ని ప్రయివేటు నిర్మాణాలు ఉన్నందున ఈ దిశగా కూడా చర్చలు సాగుతాయని తెలిసింది.

### అటవీ జంతువుల సంరక్షణ అందరి బాధ్యత

చింతలమానెపల్లి : అటవీ జంతువుల సంరక్షణ అందరి బాధ్యత అని కర్జెల్లి రేంజి అధికారి రాజేందర్ అన్నారు. మండలంలోని రవీంద్రనగర్ విద్యుత్ ఉపకేంద్రంలో అటవీ శాఖ సిబ్బందితో కలిసి వన్యప్రా ణుల సంరక్షణపై పలు సూచనలు చేశారు.

## ఆర్యవైశ్యులు ఐక్యంగా ముందుకు సాగాలి

### ఐవీఎఫ్ జిల్లా నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం

ఖమ్మం : అంతర్జాతీయ వైశ్య సమాఖ్య (ఐవీఎఫ్) ఖమ్మం జిల్లా నూతన పాలక మండలి ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం నగరంలోని వాసవి గార్డెన్‌లో అట్టహాసంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఖమ్మం ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే పువ్వాడ అజయ్‌కుమార్, సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు, దక్షిణ భారత బాధ్యుడు ఉప్పాల శ్రీనివాస్ గుప్తా, రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు వనపర్తి మేఘమాల హాజరై మాట్లాడారు. శ్రీనివాస్ గుప్తా నూతనంగా ఎన్నుకున్న నాయకులతో ప్రమాణం చేయించారు. జిల్లా నూతన అధ్యక్షుడిగా వీవీ అప్పారావు, కార్యదర్శిగా కొత్త వెంకటేశ్వర్లు, కోశాధికారిగా రామన్నను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గుప్తా మాట్లాడుతూ ఎన్నికైన నూతన పాలక మండలి సభ్యులు సంఘ ఆశయాలకు కట్టుబడి విధులు మూడేళ్ల పాటు అంకితభావంతో నిర్వర్తించాలని సూచించారు. తెలంగాణలో ఉన్న 20 లక్షల మంది ఆర్య వేశ్యులను, ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న 30 లక్షల మందిని ఏకతాటిపై తీసుకువచ్చేలా కృషి చేయాలన్నారు. కంచె ఐలయ్యపై పోరాటంలో వైశ్యులు ఉమ్మడిగా పోరాడటాన్ని గుర్తు చేశారు. సంఘం తరపున సంఘంలోని వృద్ధుల కోసం షష్టిపూర్తి శుభకార్యాలు, 450మంది మహిళలకు సామూహిక సీమంతాలు వంటి కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే పువ్వాడ మాట్లాడుతూ తను ఎమ్మెల్యేగా గెలవడంలో వైశ్యులు అందించిన సహకారాన్ని ఎప్పటికీ మర్చిపోలేనన్నారు. వారి సంక్షేమం కోసం తాను కృషి చేస్తానని పేర్కొన్నారు.

ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ వైశ్యులను ఏకతాటిపై తీసుకుచ్చేందుకు కృషి చేస్తున్న ఐవీఎఫ్ కృషి అభినందనీయమని పేర్కొన్నారు. సంఘం కార్పోరేషన్ విషయమై ముఖ్యమంత్రితో మాట్లాడి ఏర్పాటుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమానికి ముందు ప్రతిభా పురస్కార గ్రహీత ఏలూరు మీనా ప్రదర్శించిన సంప్రదాయ నృత్యం సమావేశానికి వచ్చిన వారిని ఆకట్టుకుంది. కార్యక్రమం చివర్లో అనాథ మృతదేహాలకు దహన సంస్కారాలు నిర్వహిస్తున్న అన్నం శ్రీనివాసరావు, నేత్ర నిధి సహకారంతో సమాజ సేవకు కృషి చేస్తున్న పద్మనాభంను సన్మానించారు. జిల్లా సంఘం అధ్యక్షురాలుగా కవితను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఐవీఎఫ్ తెలంగాణ ఉపాధ్యక్షుడు పి.ప్రసాద్, మార్కెటింగ్ కమిటీ ఛైర్మన్ జి.కృష్ణా తదితరులు పాల్గొన్నారు.

## టాస్క్‌ఫోర్స్ అధికారుల ఆకస్మిక తనిఖీ

## అక్రమాలకు పాల్పడిన యాజమాన్యం

భైంసా : ప్రజాపంపిణీ కోసం ప్రభుత్వం అందజేసే వడ్లను నూర్పిడిచేసి బియ్యం అందించేందుకు ఒప్పందం కుదుర్చుకున్న ఓ రైస్‌మిల్లు యాజమాన్యం అక్రమాలకు పాల్పడుతున్నట్లు గుర్తించిన రాష్ట్ర పౌరసరపరాలశాఖ టాస్క్‌ఫోర్స్ అధికారులు రెండు రోజుల పాటు రైస్‌మిల్లులో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి సీజ్‌చేసి కేసు నమోదుచేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు రాయితీపై బియ్యం అందజేసేందుకు రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలుచేసి వివిధ రైస్‌మిల్లులతో ఒప్పందం కుదుర్చుకుని నూర్పిడి చేయించి వచ్చే బియ్యంను పౌరసరఫరాల సంస్థ సేకరిస్తుంది. అందులో భాగంగా భైంసా మండల వానల్‌పాడ్ గ్రామానికి చెందిన రాజేశ్వర్ రైస్‌మిల్లు యాజమాన్యం 2016-17 సంవత్సరం రబీ సీజన్‌లో ప్రభుత్వం నుంచి 31129.60(77824 బస్తాలు) క్వింటాళ్ల వడ్లు నూర్పిడి చేసి ఇచ్చేందుకు తీసుకుంది. అందులో నుంచి 21,228.60కింటాళ్ల వడ్లు(53071బస్తాలు) మిల్లింగ్‌చేసి 12,575 క్వింటాళ్ల బియ్యాన్ని ప్రభుత్వానికి సరఫరా చేసింది. ధాన్యం నూర్పిడి, అందచేసిన బియ్యంలో అవకతవకలకు పాల్పడుతున్నట్లు రాష్ట్ర పౌరసరఫ రాలశాఖకు ఉప్పందింది. ఈ మేరకు ఆ సంస్థ రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ ఈటీఎఫ్-3 హైదరాబాద్ ఓఎస్‌డీ ఎం.దివాకర్ ఆధ్వర్యంలో అధికారులు కె.సుదర్శన్‌రెడ్డి, పి.రాఘవరెడ్డి, పి.రమేశ్ నిర్మల్ పౌరసరఫరాలశాఖ జిల్లా అధికారి(డీఎస్‌వో) ఆర్.సుదర్శన్, భైంసా డీటీ ఎన్‌ఫోర్స్‌మెంట్ సత్యనారాయణల బృందం శుక్రవారం మధ్యాహ్నం వానల్‌పాడ్ రైస్‌మిల్లుల్లో ఆకస్మిక దాడులు నిర్వహించారు. మిల్లులో ఉన్న వడ్లు, మిల్లులో విద్యుత్తు మీటరు, వినియోగించిన విద్యుత్తు రీడింగు, ప్రభుత్వం నుంచి తీసుకున్న వడ్లు, సరఫరా చేసిన బియ్యం తదిరత రికార్డులను క్షుణ్ణంగా తనిఖీచేశారు.

ఈ మేరకు మిల్లు యాజమాన్యం పలు అవకతవకలకు పాల్పడినట్లు తేలిందని ఓఎస్‌డీ ఎం. దివాకర్ తెలిపారు. ఈ మేరకు డీఎస్‌వో సుదర్శన్ మాట్లాడుతూ రైస్‌మిల్లు యాజమాన్యంపై ప్రజాపంపిణీ చట్టం కింద 6ఏ కేసు నమోదు చేసి మిల్లును సీజ్‌చేస్తున్నట్లు తెలిపారు.

# విజయభాను సంపాదకీయం

## పల్లెనిద్రతో సత్ఫలితాలు

కలెక్టరు మొదలు జిల్లాస్థాయి అధికారులు అంతా గ్రామాలు తిరుగుతూ సమస్యలు తెలుసుకుంటున్నారు. క్షేత్రస్థాయిలో గ్రామాల్లో ఉన్న సమస్యలను స్వయంగా చూసి తెలుసుకుని చేపట్టాల్సిన చర్యలను అధికారులు స్వయంగా పర్యవేక్షించే పరిస్థితి నేడు ఉన్నది. అందువల్ల ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలన్నీ సమర్థంగా అమలు జరుగుతున్నాయి. నిజమైన లబ్ధిదారులకు సంక్షేమ ఫలాలు చేరుతున్నాయా లేదా అన్నది గ్రామస్థాయిలో పర్యవేక్షణ ఉంటున్నది. గ్రామీణ వృత్తి జీవితాలతో ఉన్న వివిధ సామాజిక సమూహాల అభివృద్ధికి చేపట్టిన సంక్షేమ పథకాలు విజయవంతంగా అమలవుతున్నాయి. తెలంగాణ ఆవిర్భావం నుంచి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో దేశంలోనే తనదైన ప్రత్యేకతను చాటుకున్న రాష్ట్ర ప్రభుత్వం పాలనా విధానాల్లోనూ నూతనాధ్యాయాన్ని సృష్టించింది. ఈ క్రమంలోనే ప్రజల ముంగిటకు పాలనను తీసుకెళ్లేందుకు, పాలనా సౌలభ్యం కోసం కొత్తగా 21 జిల్లాలను ఏర్పాటు చేస్తూ గతేడాది దసరా పండుగ సందర్భంగా చరిత్రాత్మక నిర్ణయం తీసుకున్నది. కొత్త జిల్లాల ఏర్పాటుతో ఈ ఏడాది కాలంలో ప్రభుత్వం ప్రజలకు మరింత చేరువైంది. ఈ నేపథ్యంలో బుధవారం జిల్లా కేంద్రాలలో కలెక్టరేట్ల నిర్మాణానికి శంఖుస్థాపనలు జరుగుతుండటం ఓ అద్భుత ఘట్టం. ఈ నిర్మాణం చేపడుతున్న కలెక్టరేట్ భవనాలు జిల్లా పాలనా కార్యాలయాలుగానే మిగిలిపోవడంలేదు. సమీకృత కలెక్టరేట్లుగా సకల సదుపాయాలు కలిగి ఉంటాయి. జిల్లాస్థాయి ప్రభుత్వ పాలనా కార్యాలయాలన్నీ ఒకే సముదాయంలో ఉంటున్నాయి. పద్దెనిమిది జిల్లాల్లో కొత్తగా నిర్మించనున్న కలెక్టరేట్లన్నింటినీ సమీకృత పాలనా, పర్యవేక్షక, సంక్షేమ కార్యాలయాలుగా రూపుదిద్దనున్నారు. వీటి నిర్మాణానికి 1,032 కోట్లను కేటాయించడం చూస్తే వాటి ప్రాధాన్యం అర్థమవుతున్నది. సిరిసిల్ల, సిద్దిపేట జిల్లాల కలెక్టరేట్ల శంఖుస్థాపనలకు స్వయంగా ముఖ్యమంత్రి కేసీఆర్ వెళ్తున్నారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా ఆయా జిల్లాల నుంచి ప్రభుత్వంలో మంత్రులుగా ప్రాతినిధ్యం వహిస్తున్న వారు కలెక్టరేట్లకు శంఖుస్థాపన చేస్తారు. ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణాన్ని చేపట్టి కూడా గొప్పలు పోవటమేనా అని రంధ్రాన్వేషకులు అనవచ్చు. అయితే గత పాలనలో ప్రభుత్వ కార్యాలయాల పనితీరు అంతంత మాత్రంగా ఉండేది. వివిధ కార్యాలయాలు జిల్లా కేంద్రంలో నలుమూలలా అక్కడొకటి, ఇక్కడొకటి విసిరేసినట్లుగా ఉండేవి. వాటి పనితీరు, సమన్వయ లోపం తో పాలనా నిర్వహణలో ఎదురైన ఇబ్బందులు, ప్రజలు ఎదుర్కొన్న కష్టాలు అన్నీఇన్నీ కావు. ఇలాంటి సమస్యలన్నింటికీ పరిష్కారంగా నేడు జిల్లా పాలనా కార్యాలయాలన్నీ ఒకే సముదాయం లో ఉండేట్లు సమీకృత కలెక్టరేట్లు రూపుదిదుకోనున్నాయి. దీంతో పాలనలో వివిధ ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం ఏర్పడుతుంది. ప్రజలు తమ పనుల కోసం వివిధ కార్యాలయాలకు తిరుగకుండా ఒకేచోట చేసుకోవచ్చు. గతంలో అయితే ప్రతి జిల్లా సగటు జనాభా సుమారు 35 లక్షలుగా ఉండేది. ఇప్పుడు పది జిల్లాల స్థానంలో 31 జిల్లా ల ఏర్పాటుతో దాదాపు పదకొండు లక్షల జనాభాకు ఒక పాలనా విభాగంగా జిల్లాలు ఏర్పాటు అయ్యాయి. వీటికి అనుగుణంగానే 25 కొత్త రెవె న్యూ డివిజన్లు, 125 కొత్త మండలాలు ఏర్పాటయ్యాయి. ఏదైనా ప్రాంతం సుస్థిరాభివృద్ధి సాధించాలంటే శాంతిభద్రతలకు ఎనలేని ప్రాధాన్యమున్నది. ఇందుకోసం ప్రభుత్వం ప్రాంతాలవారీగా ప్రజల రక్షణ, సౌకర్యార్థం నాలుగు పోలీస్ కమిషనరేట్లను, పోలీస్ సబ్ డివిజన్లను, సర్కిళ్లను, పోలీస్‌స్టేషన్లను ఏర్పాటుచేసి ప్రజల శాంతియుత జీవనానికి అండగా నిలుస్తున్నది. ప్రభుత్వం తీసుకుంటున్న ఈ చర్యల కారణంగా రాష్ట్ర సాధనోద్యమంలో ప్రధాన ఆకాంక్షగా ఉన్న ప్రజల ముంగిట పారదర్శక పాలన ఇప్పుడు అనుభవంలోకి వస్తున్నది. జిల్లాస్థాయిలో ప్రజలకు అవసరమైన ఏ పనయినా సమీకృత కలెక్టర్ సముదాయంలో అడుగుపెట్టి సాయంత్రం కల్లా పూర్తి చేసుకొని కాగితం చేతిలో పట్టుకొని ఇంటికి ముఖం పట్టే పాలనా సౌకర్యం అందుబాటులోకి వస్తున్నది. కలెక్టరు మొదలు జిల్లాస్థాయి అధికారులు అంతా గ్రామాలు తిరుగుతూ సమస్యలు తెలుసుకుంటున్నారు.

క్షేత్రస్థాయిలో గ్రామాల్లో ఉన్న సమస్యలను స్వయంగా చూసి తెలుసుకుని చేపట్టాల్సి న చర్యలను అధికారులు స్వయంగా పర్యవేక్షించే పరిస్థితి నేడు ఉన్నది.

# కంచె ఐలయ్యకు అమెరికా రక్షణ కల్పిస్తుందట..!

న్యూఢిల్లీ : ఆర్యవైశ్యులను సామాజిక స్మగ్లర్లుగా అభివర్ణిస్తూ.. పుస్తకం రాసి వివాదాలు రాజేసిన కంచ ఐలయ్యకు అమెరికా ఆశ్రయం కల్పిస్తుందట. తనకి ఇక్కడ రక్షణ లేదు కాపాడండి అని కోరితే.. అమెరికాయే పూర్తి ఖర్చును భరించి మరీ ఆశ్రయం కల్పిస్తుందని కంచ ఐలయ్య తెలిపారు. తాను మాత్రం చచ్చేంత వరకూ పుట్టిన గడ్డ మీదే ఉంటానన్నారు. హైదరాబాద్‌లో భావ ప్రకటనా స్వేచ్ఛకు భంగం వాటిల్లుతోందని ఆయన వాపోయారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూతురు ఇవాంకా ట్రంప్‌కి ఈ విషయం తెలిస్తే పెట్టబడుల విషయంలో ప్రతికూలంగా మారే అవకాశం ఉందని హెచ్చరించారు. నవంబర్ చివరి వారంలో జరగనున్న గ్లోబల్ ఎకనమిక్ సమ్మిట్ కోసం ఇవాంకా హైదరాబాద్ రానున్నారు.

దీన్ని దృష్టిలో ఉంచుకునే ఐలయ్య ఈ వ్యాఖ్యలు చేశారు. చట్టాలను మార్చి తనను ఉరి తీయాలని మాట్లాడిన టీడీపీ ఎంపీ టీజీ వెంకటేశ్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని, రాజ్యసభ సభ్యత్వం రద్దు చేయాలని ఏపీ సీఎం చంద్రబాబు నాయుణ్ని కంచ ఐలయ్య డిమాండ్ చేశారు. భార్త్‌లో వాక్ స్వాతంత్ర్యం ప్రమాదంలో పడిందని అమెరికా హౌజ్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్ సీనియర్ మెంబర్ ట్రెంట్ ఫ్రాంక్స్ ఆందోళన వ్యక్తం చేశారు. దీనికి టీజీ వెంకటేశ్ స్పందిస్తూ.. అమెరికా సంస్కృతి గురించి ఎగతాళిగా మాట్లాడారు. దీని వల్ల అమెరికాలోని భారతీయులకు ప్రమాదకర పరిస్థితులు ఎదురయ్యే అవకాశం ఉంది అని కంచ ఐలయ్య వ్యాఖ్యానించారు. సామాజిక స్మగ్లర్లు కోమటోళ్లు పేరిట కంచ ఐలయ్య రాసిన పుస్తకాన్ని నిషేధించాలని కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయించగా.. కోర్టు ఆ వినతిని తిరస్కరించింది. ఈ నేపథ్యంలో అక్టోబర్ 28న విజయవాడలో బహిరంగ సభ ఏర్పాటు చేసి ఆయన్ను సన్మానించచడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ సభను అడ్డుకుంటామని ఆర్యవైశ్యులు హెచ్చరిస్తున్నారు.

# ఎర్ర జెండా ఊపాడు... రక్షకుడిగా మారాడు...



కోల్‌కతా : హౌరా-న్యూఢిల్లీ మార్గంలో భారీ రైలు ప్రమాదం తప్పింది. ఓ వ్యక్తి చూపిన వివేకం వల్ల వందలాది అమాయకుల ప్రాణాలు నిలిచాయి. బుర్ద్వాన్ జిల్లాలో ఆదివారం జరిగిన ఈ సంఘటన వివరాలను ఓ వార్తా సంస్థ తెలిపింది. అయితే దీనిపై పశ్చిమ రైల్వే అధికారులు ఎటువంటి ప్రకటన చేయలేదు.

ఆ వార్తా సంస్థ కథనం ప్రకారం హౌరా-న్యూఢిల్లీ మార్గంలో బుర్ద్వాన్ జిల్లాలో రైలు పట్టాలను దగ్గరకు చేర్చి, పట్టి ఉంచే ఫిష్ ప్లేట్ తొలగిపోయి ఉండటాన్ని స్థానికుడొకరు గమనించారు. అదే సమయంలో అటువైపు ఓ రైలు దూసుకొస్తుండటాన్ని చూశారు. వెంటనే అప్రమత్తమై తన వద్దనున్న ఎర్రని వస్త్రాన్ని ఊపుతూ, రైలు డ్రైవర్‌కు సంకేతాలు పంపించారు. రైలు డ్రైవర్ కూడా ఏదో ప్రమాదం పొంచి ఉందని గ్రహించి, అత్యవసరంగా బ్రేకులు వేసి, రైలును ఆపేశారు.

దీంతో ఆ రైలు ఫిష్ ప్లేట్లు తొలగించబడి ఉన్న ప్రదేశానికి కాస్త దూరంలో ఆగింది. దీంతో ప్రయాణికులంతా ఊపిరి పీల్చుకున్నారు. రైలు డ్రైవర్‌ను, స్థానికుడిని ప్రశంసించారు.

# నీటి బయట తిరిగే వింత చేప



న్యూఢిల్లీ : నీటి నుంచి బయటపడిన చేప ప్రాణాలతో ఉంటుందని కలలో కూడా ఊహించలేం. అయితే ఈ చేపలు.. నీటి బయట ప్రాణంతో ఉండటంతోపాటు, భూమిపై ముందుకు కదలడం విశేషం. ఈ చేపలు థాయిలాండ్‌లో కనిపిస్తాయి. పసిఫిక్ ఆసియా సముద్రంలో మడ్ స్కిప్పర్ అనే చేపలుంటాయి. ఇవి నీటి బయట కూడా మనగలుగుతాయి. వీటి శరీరంపై రెండు స్పాంజ్ పౌచుల్లాంటి నిర్మాణాలుంటాయి. దీంతో ఇవి బయటకు వచ్చినప్పుడు వీటిలో నీటిని నింపుకొని వస్తాయి.

అప్పుడు ఆ నీరే వీటికి ఆధారంగా నిలుస్తుంది. ఈ రెండు సంచుల్లోని నీరు అయిపోగానే ఈ చేప తిరిగి నీటిలోనికి వెళ్లిపోతుంది. ఈ చేప కళ్లు దాని తల పైభాగాన ఉండటం విశేషం.

# ఉపఎన్నిక నుంచే బరిలోకి దిగనున్న స్టార్ హీరో

చెన్నై : రాజకీయప్రవేశానికి సన్నాహాలు చేసుకుంటున్న సినీనటుడు కమల్‌హాసన్ ఆర్కేనగర్ అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నిక ద్వారానే రాజకీయ ప్రస్థానాన్ని ఆరంభించే సూచనలు కన్పిస్తున్నాయి. వందరోజుల్లో ఏ ఎన్నికలు జరిగినా ఆలోపున తాను తప్పకుండా రాజకీయ ప్రవేశం చేస్తానని గతంలో కమల్‌హాసన్ ప్రకటించిన విషయం తెలిసిందే. మాజీ ముఖ్యమంత్రి జయలలిత ప్రాతినిధ్యం వహించిన చెన్నై ఆర్కేనగర్ ఉప ఎన్నికలు ఈ డిసెంబర్ లోపున జరగనుం డటంతో ఈ ఎన్నికల్లోనే కమల్ రాజకీయప్రవేశం చేస్తారని అందరూ భావిస్తున్నారు. ప్రస్తుతం అధికార అన్నాడీఎంకేపై ప్రచ్ఛన్న యుద్ధం సాగి స్తున్న కమల్‌హాసన్ డెంగ్యూ తీవ్రతపై ట్విట్టర్‌లో తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అన్నా డీఎంకే ప్రభుత్వం అవినీతిమయమై పోయిందని, మంత్రులు అక్రమార్జనలకు పాల్పడుతున్నారని, తన అభిమాన సంఘాల నాయకులు తమ ప్రాంతాల్లో ఏయే మంత్రులు ఎంతమేరకు అక్రమార్జనకు పాల్పడు తున్నారనే వివరాలను సేకరించి ప్రభుత్వ వెబ్‌సైట్‌లో ఫిర్యాదులు చేయాలని పిలుపునిచ్చి సంచలనం సృష్టించారు.

కమల్‌హాసన్ ట్విట్టర్ ద్వారా ప్రభుత్వంపై విమర్శలు చేయడం మానుకొని, రాజకీయ ప్రవేశం చేసి మాట్లాడటం సమంజసంగా ఉంటుందన్న మంత్రి జయకుమార్ మాటలకు స్పందించిన కమల్‌హాసన్... రాష్ట్రంలో వంద రోజుల లోపు ఏ ఎన్నికలు వచ్చినా ఆ లోపున తాను పార్టీ ప్రారంభించి, రాజకీయ ప్రవేశం చేస్తానని ట్వీట్ చేసి సంచలనం కలిగించారు. అలాగే ఇటీవల ఓ తమిళ ప్రైవేటు టీవీ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలోనూ ఈ విషయాన్ని నిర్ధారించారు.

## కవి సమయం

# సమస్యలు

మానవ మస్తిష్కం ఆందోళనలు, ఆవేదనలు
ఆలోచించకపోతే ఏమీ లేదు
ఆలోచిస్తే అన్నీ సమస్యలమయం
రాజకీయ, ఆర్థిక, విద్య, వైద్యరంగాలు
ఏదైతేనేమి అన్ని రంగాలు అస్తవ్యస్తం
నిరాశ నిస్పృహలు, సమస్యల వెతలు
బడా పరిశ్రమల ధాటికి చిన్న పరిశ్రమలు క్లోజ్
ప్రైవేటు పాఠశాలలు మూతబడ్డాయి
ప్రైవేటు, కార్పొరేటు వైద్యాలయాలు
ధనవంతులకు అందుబాటు, బడుగులకు దూరం
ప్రభుత్వ ఆసుపత్రులులో మందులు కొరత
డాక్టర్ల నిర్లక్ష్యం రోగుల ప్రాణాలు హరీ
ప్రశ్నిస్తే, నిలదీస్తే అరెస్టులు కేసులు
'మేడే'లు వస్తుంటాయి, పోతుంటాయి
కార్మికులకు రక్షణ కరువైన కార్మిక చట్టాలు
గ్యారంటీలేని కార్మికుల జీవితాలు
ఉపాధి దొరకని వలస కూలీలు
పాలక పార్టీలు కిరాయి కార్యకర్తలుగా మారారు
ఎటుచూసినా పేదల జీవితం అంధకారమే.

... తుంపాల శ్రీరామమూర్తి
సెల్ నెం : 9440260280

# పంచాంగం

మాసం : కార్తీక శు. చవితి రా.తె. 04-02
అనురాధ మ. 01-24 వ.రా. 07-34 ల 09-19

సోమవారం 22-10-2017

**మేషం** : ఉద్యోగస్తులు ఒత్తిళ్ళు, ప్రలోభాలకు దూరంగా ఉండటం మంచిది. కీలకమైన వ్యవహారాల్లో తీసుకున్న నిర్ణయాల వల్ల కష్టనష్టాలు ఎదుర్కొంటారు. వాహనం నడుపుటలో మెలకువ అవసరం. **వృషభం** : ప్రముఖులు, సన్నిహితుల కలయిక సాధ్యంకాదు. నిరుద్యోగయత్నాలు ఓ కొలిక్కి వస్తాయి. క్రయ విక్రయాలు సామాన్యం. మీ ఆలోచనలు పలు విధాలుగా ఉంటాయి. ఆత్మీయులకు విలువైన బహుమతులు అందిస్తారు. ఉద్యోగస్తులు ఎదురుచూస్తున్న ప్రమోషన్ అందుకుంటారు. **మిథునం** : అనుకున్న పనులు కొంత ముందు వెనుకలుగానైనా సంతృప్తికరంగా పూర్తి చేస్తారు. ఎగుమతి, దిగుమతి వ్యాపారస్తులకు, జాయింటు వ్యాపారస్తుల శ్రమకు తగిన ప్రతిఫలం లభిస్తుంది. గతంలో విడిపోయిన భార్యాభర్తలు తిరిగీ కలిసే అవకాశం ఉంది. నిత్యావసర వస్తు స్టాకిస్టులకు లాభదాయకం. **కర్కాటకం** : చిన్నతరహా పరిశ్రమలు, చిరు వ్యాపారులకు సంతృప్తి, పురోభివృద్ధి. ఉద్యోగం చేయు స్త్రీలకు దూరప్రాంతాలకు బదిలీలు అవుతాయి. శస్త్ర చికిత్స చేయునప్పుడు వైద్యులకు ఏకాగ్రత అవసరం. కార్మికులకు, ప్రైవేటు సంస్థలందు పనిచేసే క్రింది ఉద్యోగస్తులకు తగిన గుర్తింపు లభిస్తుంది. **సింహం** : సోదరీ, సోదరుల మధ్య ఆస్తి విషయాల గూర్చి తగాదాలు రావచ్చు. ప్రముఖుల ద్వారా ఉద్యోగస్తులు కొత్త పనులు చేపడతారు. చేపట్టిన పనులు అర్ధాంతరంగా ముగించాల్సి వస్తుంది. కుటుంబంలో ఒకరి ధోరణి మీకు ఎంతో చికాకు కలిగిస్తుంది. నూతన వ్యాపారాలు ప్రారంభించేందుకు అనువైన సమయం. కోర్టు వ్యవహారాలు వాయిదా పడుట మంచిది. **కన్య** : నిర్మాణ పనులలో కాంట్రాక్టర్లకు ఓర్పు, నేర్పు ఎంతో ముఖ్యం. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. ఇతరులను అతిగా విశ్వసించటం వల్ల నష్టపోయే ప్రమాదం ఉంది జాగ్రత్త వహించండి. బంధుమిత్రులతో కీలకమైన విషయాలు చర్చలు జరుపుతారు. ఖర్చులు ప్రయోజనకరం. **తుల** :కొన్ని ముఖ్యమైన విషయాల్లో పట్టువిడుపు ధోరణితో వ్యవహరించటం మంచిది. వైద్యులకు ఒత్తిడి, ఇంజనీరింగ్‌లకు సంతృప్తి, ప్లీడర్లకు చికాకులు తప్పవు. సిమెంటు, కలప, ఐరన్, ఇటుక వ్యాపారులకు మందకొడిగా ఉంటుంది. పారిశ్రామిక, కార్మిక సంబంధ బాంధవ్యాలు మెరుగవుతాయి. మీ శత్రువులే మీకు మిత్రులై సహాయ, సహకారాలను అందిస్తారు. **వృశ్చికం** : ఉత్తర ప్రత్యుత్తరాలు సమర్థవంతంగా నిర్వహిస్తారు. వృత్తి, వ్యాపారులకు ఆశించినంతగా పురోభివృద్ధి ఉండదు. ఉద్యోగస్తులు పదోన్నతి కోసం చేసే యత్నాలు కొంతవరకు సఫలం అవుతాయి. ప్రయాణాలు, ఇతర కార్యక్రమాలు వాయిదా పడతాయి. నిరుద్యోగులు ఉద్యోగాలకై చేయు ప్రయత్నాలు ఆశాజనకంగా సాగుతాయి. **ధనుస్సు** : స్త్రీలకు అలంకరణలు, విలాస వస్తువుల మీద మక్కువ పెరుగుతుంది. ఉద్యోగస్తులు తోటివారి నుండి ఆహ్వానాలు అందుకుంటారు. ఒక ముఖ్య విషయమై న్యాయసలహా పొందవలసి వస్తుంది. స్టేషనరీ, ప్రింటింగ్ రంగాల వారికి శుభదాయకం. ప్రైవేటు సంస్థల్లోని వారికి ఊహించని మార్పులు సంభవిస్తాయి. ప్రేమికులు శుభవార్తలు వింటారు. **మకరం** ఒక విషయంలో మీ జీవిత భాగస్వామి సలహా పాటించటంవల్ల కలసి రాగలదు. ఉపాధి పథకాల దిశగా నిరుద్యోగుల ఆలోచనలు ఉంటాయి. విదేశీయాన యత్నాలలో ఆటంకాలు తొలగిపోగలవు. పరోపకారానికి పోయి సమస్యలు తెచ్చుకోకండి. **కుంభం** : ఉద్యోగస్తులు అధికారులతో ఏకీభవించలేరు. ఏజెంట్లకు, బ్రోకర్లకు పురోభివృద్ధి. రియల్ ఎస్టేట్ రంగాల వారికి నూతన వెంచర్ల విషయంలో ప్రతికూలతలు, చికాకులు ఎదురవుతాయి. ప్రైవేటు, ప్రభుత్వ సంస్థల్లోని వారి శ్రమకు తగిన ప్రతిఫలం కానరాదు. **మీనం** :విద్యార్థినులు పట్టుదలతో శ్రమించిన సత్ఫలితాలు సాధించగలరు. ఆరోగ్యం విషయంలో అధికమైన జాగ్రత్త అవసరం. అవివాహితులకు శుభదాయకమైన వార్తలు తెలుస్తాయి. క్రయవిక్రయాలు సామాన్యం. కొత్త కొత్త వ్యాపార రంగాలపట్ల ఆసక్తి పెరుగుతుంది. ముఖ్యుల గురించి ధనం వెచ్చిస్తారు.



# శివత్వం

## సంకీర్తన

'శివ' శబ్దం మానవాళికి అవసరమైన శ్రేయస్సును, మంగళాన్ని, క్షేమాన్ని సూచిస్తుంది. ఈ మూడూ లభించాలంటే మనిషి తనకు తానుగా ప్రయత్నించాలి. తనలో శివత్వానికి శ్రీకారం చుట్టాలి. అప్పుడే అతడి ఆకాంక్ష కార్యరూపం ధరిస్తుంది.

మంచి చేయాలనుకునే మనిషిని శివుడిలోని అనంత కల్యాణ గుణాలు ఆకర్షిస్తాయి. నిరాడంబర వేషం, ధీనులపై జాలి చూపే తత్వం, విశ్వక్షేమం కోసం కాలకూట విషాన్నీ స్వీకరించేంత సాహసం ఇలా శివగుణాలెన్నో పరమేశ్వరుడిలో సాక్షాత్కరిస్తాయి.

సకల మంగళాన్నీ తనలో నింపుకొన్న శివుణ్ని మనిషి ఆరాధిస్తాడు. ఆ ఆరాధన మానసికం, బాహ్యం అని రెండు విధాలు.

రెండూ కలిస్తేనే అది సమగ్ర పూజ అవుతుంది. మనసు ఒకవైపు, శరీరం ఒక వైపు ఉంటే పూజా సమయంలో ఏకాగ్రత కుదరదు.

అది లేకుంటే పూజకు సార్థకత లేదు. అందుకే పెద్దలు 'భక్తి లేని పూజ పత్రి చేటు' అన్నారు. శివారాధనలో త్రికరణ శుద్ధి కావాలి.

అంటే త్రికరణాలైన మనసు, వాక్కు, శరీరాలు చక్కగా పనిచేఆలి. అప్పుడే అది మంగళప్రదంగా మారుతుంది.

శివారాధనకు అన్నీ శుభ సమయాలే! ప్రతి మాసంలోనూ కృష్ణపక్షంలోని చతుర్ధశి తిథి శివపూజకు ఎంతో అనువైనది. దీన్ని 'మాస శివరాత్రి' అంటారు. మాఘమాసంలోని కృష్ణపక్ష చతుర్ధశినాడు శివుడు మహాలింగాకృతిలో ముల్లోకాలకు దర్శంన భాగ్యం కలిగించాడని, అందరినీ తరింపజేశాడని పురాణాలు చెబుతాయి. ఆద్యంతాలు లేని విధంగా శివలింగం అఖిల బ్రహ్మాండాల్లో వ్యాపించి, విశ్వరూపాన్ని ప్రదర్శించింది. ఆ మహిమకు బ్రహ్మాది దేవతలే ఆశ్చర్య చకితులయ్యారు.

ప్రదోషకాలం (సాయంకాలం వేళ) నుంచి అర్ధరాత్రి వరకు శివపూజకు తగిన కాలం. అర్ధరాత్రి వేళను 'లింగోద్భవ కాలం' అంటారు.

ఆ సమయంలో పరమేశ్వరుడికి చేసే అభిషేకార్చన అమోఘ ఫలాలు ప్రసాదిస్తుందని భక్తులు విశ్వసిస్తారు.

శివుడి పేరులోని క్షేమం, కల్యాణం, మంగళం, భవిష్యత్తు, కుశలం, శ్రేయస్సు అనే అర్థాలను తనలో శాశ్వతంగా నిలుపుకోవడానికి ప్రతి ఒక్కరూ యత్నించాలి. ఇదే శివతత్వ రహస్యం! లోకంలోని సంపదలేవీ శాశ్వతం కావని, మనిషి చేసే సుకృతాలు, పరోపకారాలు, సేవలే శాశ్వతాలని ఇందులోని సారాంశం. మంచిపనులే చేయాలన్న శివ ప్రబోధాన్ని మనిషి మొదట తానుగా గ్రహించగలగాలి. పూజలోని పరమార్థమూ ఇదే.

చైత్ర మాసం మొదలు ఫాల్గుణ మాసం వరకు వున్న పన్నెండు నెలల్లోని ప్రకృతి సుకృతాలు చేయాలని మానవాళికి బోధిస్తుంది.

వికాసానికి మూలం వసంతం. ప్రచండ శక్తికి ప్రతీక గ్రీష్మం. అమృతత్వానికి కారణమయ్యేది వర్షం. స్వచ్ఛతకు గుర్తు శరత్తు. ముకుళించే మనిషి తత్వానికి చిహ్నం హేమంతం. ఇవన్నీ మానవ జీవితాలకు మార్గదర్శనం చేస్తున్నాయి. ప్రకృతిలో ఉన్నదంతా శివతత్వమే.

ఉత్తుంగ పర్వతాలు శివుడి జటాజుటాన్ని, నదీ ప్రవాహాలు ఆయన తలపైన ఉన్న గంగను, హిమంతో నిండిన నేల ఈశ్వరుడి భస్మలిప్త శరీరాన్ని, సూర్యచంద్రాగ్నులు ఆయన నేత్రాల్ని తలపింపజేస్తాయి. సమస్తం శివమయమన్న భావన కలిగిస్తాయి.

ఇదే శివారాధనలోని తాత్పర్యం!పూజ అనేది మానసిక సంస్కారానికి గుర్తు. మనసు ఎంత ఉన్నతమైతే, చేసే పూజ అంత ఫలవంతం అవుతుంది.

ప్రకృతి ఉచితంగా అందించే పత్రాలు, పుష్పాలు, ఫలాలే శివారాధనకు చాలు. మనసుతో శివార్చన చేయాలి. సుగుణాలతో జీవనం గడిపితే, అది శివార్చనమే.

# హమాలీలకు ప్రభుత్వ గోదాంలలో పనులు చూపాలి



పాలమూరు : జిల్లావ్యాప్తంగా ఉన్న హమాలీలు ప్రభుత్వ గోదాంల వద్ద అనేకేళ్ల నుంచి పనులు చేస్తున్నారని, కాని ఇప్పుడు పనులను కల్పించడం లేదని సీఐటీయూ జిల్లా కోశాధికారి చంద్రకాంత్ పేర్కొన్నారు. మహబూబ్ నగర్‌లోని పాత మోతీనగర్‌లో ఉన్న సీడబ్ల్యూసీ ప్రభుత్వ గోదాంల వద్ద హమాలీలు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రభుత్వ గోదాంలలో 162 మంది హమాలీలు పని చేస్తున్నారని తెలిపారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి కూలీలు ప్రతిరోజు ఇక్కడికి వచ్చి ఉదయం నుంచి సాయంత్రం వరకు పనులు చేస్తారని తెలిపారు. కాని గత ఆరు నెలల నుంచి పనులు లేక కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. 40వేల టన్నుల సామర్థ్యం ఉన్న ప్రభుత్వ గోదాంలలో ధాన్యం నిల్వ ఉంచకుండా 10 కి.మీ.ల దూరంలో ఉన్న ప్రైవేటు గోదాంలలో ధాన్యాన్ని నిల్వ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారం రోజుల్లో హమాలీలకు పనులను కల్పించకపోతే జిల్లా వ్యాప్తంగా ఆందోళనకు శ్రీకారం చుడతామన్నారు. కార్యక్రమంలో హమాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు దావీద్, నాయకులు తిరుమలయ్య, వెంకట్రాములు, కృష్ణయ్య, ధనుంజయ్, శంకర్, రాము, విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

# సిద్దిపేటలో ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి పోటీలు

సిద్దిపేట : ఆరోగ్యమే మహాభాగ్యమని, యోగాతో ఆ మహాభాగ్యం తప్పక సిద్ధిస్తుందని జిల్లా రెవెన్యూ అధికారి(డీఆర్వో) చంద్రశేఖర్ అన్నారు. పాఠశాల క్రీడా సమాఖ్య (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో అండర్-14, 17 విభాగాల్లో రాష్ట్రస్థాయి యోగా పోటీలను సిద్దిపేటలోని వడ్డేపల్లి దయానంద్ ఫంక్షన్‌హాల్‌లో శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఈవో విజయలక్ష్మి, ఎస్‌జీఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి సుజాతతో కలిసి జ్యోతిప్రజ్వలన చేసి పోటీలకు అంకురార్పణ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు, గురువుల ప్రోత్సాహంతో రాష్ట్రస్థాయికి చేరుకున్నారని, అదే ఒరవడిని కొనసాగించాలన్నారు. సదుపాయాలను సద్వినియోగం చేసుకొని జాతీయస్థాయిలో రాణించాలన్నారు. అందరూ విజేతలేనని, బృంద స్ఫూర్తితో ముందుకు సాగాలనాన్నారు. డీఈవో మాట్లాడుతూ ప్రాచీన కాలం నుంచి యోగా ప్రాచుర్యంలో ఉందన్నారు. ప్రతి వ్యక్తి జీవితంలో యోగా ఒక భాగమన్నారు. ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి మాట్లాడుతూ 23వ తేదీ వరకు పోటీలు కొనసాగుతాయన్నారు. అందరి సహకారంతో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర పరిశీలకులు కమలాకర్, డీవైఎస్‌వో బాలయ్య, డీఈవో కార్యాలయ ఏడీ సుబ్బారావు, ఎంఈవో ప్రసూనాదేవి, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఈశ్వరయ్య, ప్రధాన కార్యదర్శి శేఖరం తదితరులు పాల్గొన్నారు. ప్రారంభోత్సవం సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక, యోగా ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సిద్దిపేటకు చెందిన భవాని క్లాసికల్ అకాడమీ విద్యార్థినులు నృత్య ప్రదర్శనతో అలరించారు. ఉమ్మడి మెదక్ జిల్లా విద్యార్థులు యోగాసనాలతో ఉత్సాహ పర్చారు. పాత పది జిల్లాల నుంచి అండర్-14, 17 బాలబాలికల విభాగాల్లో మొత్తం 280 మంది హాజరయ్యారు. శిక్షకులు సతీశ్ పర్యవేక్షణలో తొలిరోజు పోటీలు ఆసక్తిగా సాగాయి. ఇందులో భాగంగా అండర్-17 బాలికల విభాగంలో జిల్లాకు ఐదుగురు చొప్పున విద్యార్థులు పాల్గొన్నారు. వివిధ ఆసనాలు ప్రదర్శించారు. వ్యాయామోపాధ్యాయులు సత్యనారాయణరెడ్డి, భాస్కర్‌రెడ్డి, హరికిషన్, రామ్‌నర్సయ్య, శ్రీను, రామేశ్వర్‌రెడ్డి, సౌందర్య, సువర్ణలత, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్, జోగు రామన్న చిత్రపటాలకు క్షీరాభిషేకం

శాంతినగర్ : ఉపాధ్యాయ నియామక పరీక్ష (టీఆర్‌టీ) ఉద్యోగ ప్రకటనను తెలంగాణ ప్రభుత్వం విడుదల చేయడాన్ని హర్షిస్తూ తెరాస విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో హర్షం వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలోని మంత్రి నివాసగృహం ముందు ముఖ్యమంత్రి కేసీఆర్, జిల్లా మంత్రి జోగు రామన్న చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు అందించే విధంగా ప్రకటనలు జారీ చేయడంపై తెలంగాణ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. తెరాస విద్యార్థి విభాగం జిల్లా సమన్వయకర్త బుట్టి శివకుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం లక్ష ఉద్యోగాలు అందించడంలో భాగంగా టీఆర్‌టీ ప్రకటనను విడుదల చేయడం హర్షణీయమన్నారు. కొంత కాలంగా ప్రతిపక్ష నాయకులు ఈవిషయంలో తెలంగాణ ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు చేస్తూ రాజకీయలబ్ధి కోసం నిరుద్యోగులను మభ్యపెడుతున్నారన్నారు. ఈ ప్రకటన విడుదలతో వారి నోర్లు మూసుకుంటాయన్నారు. తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలో కొత్త పరిశ్రమలు ప్రారంభించి ప్రైవేటుసెక్టార్‌లోనూ ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూ నిరుద్యోగులకు అండగా నిలుస్తోందన్నారు. 2015-16 ఆర్థికసంవత్సరానికి సంబంధించిన బీసీ రుణాల నిధులు విడుదల చేసినందుకు మంత్రి జోగు రామన్నకు కృతజ్ఞతలు తెలిపారు. వీటిని అర్హులైన లబ్ధిదారులు అందిపుచ్చుకొని ఆర్థికంగా బలోపేతం కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో తెరాస విద్యార్థి విభాగం ఆదిలాబాద్ నియోజకవర్గ ఇంఛార్జి లొనారె విక్రమ్, ప్రధాన కార్యదర్శులు రాజు, రాకేష్, నాయకులు సాయి, కళ్యాణ్, తెరాస కార్మిక విభాగం నాయకులు నగేష్, మోహన్, ప్రమోద్, తదితరులు పాల్గొన్నారు.

# 281 ఉపాధ్యాయ కొలువులు

మెదక్ : ఉపాధ్యాయ నియాయక పరీక్ష(టీఆర్‌టీ) ప్రకటన విడుదలవడంతో జిల్లాలోని డీఎడ్, బీఈడీ అభ్యర్థుల్లో ఆశలు చిగురించాయి. ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న ఈ ప్రకటనను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ విడుదల చేసింది. జిల్లాలో 907 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా, 281 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీలున్నాయి. ఇందులో ఎస్జీటీ-152, స్కూల్ అసిస్టెంట్-86, భాషా పండితులు-39, పీఈటీ-3, ఫిజికల్ డైరెక్టర్-1 ఉన్నాయి. టీఆర్‌టీ రాసేందుకు ప్రభుత్వం నిర్వహించిన ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)లో అర్హత సాధించి ఉండాలి. జిల్లాలో డీఎడ్, బీఈడీ పూర్తిచేసిన వారిలో 6,723 మంది టెట్‌కు దరఖాస్తు చేసుకున్నారు. 94.54 శాతం మంది పరీక్ష రాశారు. ఇందులో అర్హులైన వారంతా కొలువుల పోటీలో ఉన్నారు. ప్రభుత్వం కొద్ది నెలలుగా ఉపాధ్యాయ నియామకాలు చేపడుతామని ప్రకటించగా పరీక్షకు సన్నద్ధమవుతున్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి రెండో వారంలో పరీక్ష నిర్వహించనున్నట్లు టీఎస్‌పీఎస్సీ ప్రకటించింది.

## అంగన్‌వాడీల్లో బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి -కలెక్టర్



పాలమూరు : జిల్లాలోని మూడు సీడీపీవో ప్రాజెక్టుల పరిధిలో అంగన్‌వాడీ కేంద్రాల్లో నమూనాగా ఎంపిక చేసిన వాటిలో బయోమెట్రిక్ యంత్రం ద్వారానే హాజరు తీసుకోవాలని కలెక్టర్ రొనాల్డ్‌రోస్ ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని టీడీ గుట్ట, ఫైర్‌స్టేషన్, మోనప్పగుట్ట తదితర ప్రాంతాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన బయోమెట్రిక్ యంత్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కేంద్రంలో ఉదయం మాత్రమే హాజరు నమోదు చేయాలని, పిల్లలతోపాటు, కార్యకర్తలు, ఆయాలు తమ హాజరును నమోదు చేసుకోవాలన్నారు. పౌష్టికాహారం పంపిణీలో నాణ్యత, పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. పరిశుభ్రతతో సగం రోగాలను నిరోధించవచ్చని చెప్పారు. జిల్లా కేంద్రంలో అయిదు అంగన్‌వాడీ కేంద్రాల్లో బయోమెట్రిక్ విధానం ద్వారా అమలవుతుందన్నారు. ఈ సందర్భంగా బయోమెట్రిక్ విధానంపై అంగన్‌వాడీ కార్యకర్తల అభిప్రాయాలను తెలుసుకున్నారు. చిన్నారులకు ఆట, పాటల ద్వారా విద్య నేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ గోవిందరాజులు, అర్బన్ పర్యవేక్షకురాలు మాధవి తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రం మొత్తం ఇటు వైపే చూస్తోంది

గీసుకొండ : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేస్తున్న కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు వైపే రాష్ట్రం మొత్తం ఎదురుచూస్తోందని తెరాస రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యవతి రాథోడ్ తెలిపారు. గీసుకొండ మండలం శాయంపేట హవేలీ శివారు స్టేషన్ చింతలపల్లిలో సీఎం కేసీఆర్ ఆదివారం పార్కుకు శంకుస్థాపన చేయనున్న నేపథ్యంలో జనసమీకరణ కోసం కోనాయమాకుల గ్రామంలో తెరాస మండల పార్టీ కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి కృషి వల్లనే ఈ ప్రాంతంలో టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటవుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ముంత కళావతి, గీసుకొండ, సంగెం జడ్పీటీసీ సభ్యులు ఆంగోతు కళావతి, వీరమ్మ, వైఎస్ ఎంపీపీ భాస్కర్, తెరాస మండల పార్టీ అధ్యక్షకార్యదర్శులు ధర్మారావు, జైపాల్‌రెడ్డి తదితరులుపాల్గొన్నారు.

## పత్తి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి : సీపీఎం

కామారెడ్డి : రాష్ట్రంలో పత్తిరైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు సాగర్ అన్నారు. జిల్లాకేంద్రంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కామారెడ్డి జిల్లాలో మద్నూర్, జుక్కల్ ప్రాంతాల్లో పత్తి బాగా పండిస్తారన్నారు. ఏటా సరైన ధర లేక రైతులు కుదేలవుతున్నారన్నారు. రూ.7 వేలు ఇవ్వాలని డిమాం డ్ చేశారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. పత్తిని నాణ్యతా ప్రమాణా లతో కొను గోలు చేయడం తగదన్నారు. క్వింటాకు రూ.7 వేలు చెల్లించకుంటే ఆందోళనలు ఉద్ధృతంచేస్తామన్నారు.

# అట్టహాసంగా అథ్లెటిక్స్ పోటీలు

## తరలివచ్చిన 400 మంది క్రీడాకారులు



మెదక్ : పాఠశాల క్రీడా సమాఖ్య(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో అండర్-17 రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు మెదక్‌లో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. స్థానిక ఇందిరాగాంధీ స్టేడియంలో జరిగిన పోటీలకు 31 జిల్లాల నుంచి క్రీడాకారులు తరలివచ్చారు. జిల్లా విద్యాధికారిణి సరోజినిదేవి, కోనాపూర్ సొసైటీ ఛైర్మన్, తెరాస రాష్ట్ర కార్యదర్శి దేవేందర్‌రెడ్డి జ్యోతి వెలిగించి పోటీలు ప్రారంభించారు. ఎస్‌జీఎఫ్ జెండా ఆవిష్కరించాక ఆయా జిల్లాల క్రీడాకారులు కవాతుతో గౌరవవందనం చేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో డీఈవో మాట్లాడుతూ.. చదువుతో పాటు క్రీడలు ఎంతో ముఖ్యమన్నారు. శారీరక, మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదపడుతాయని, ఆటల్లో రాణించి జిల్లాకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రాష్ట్రంలోనే మెదక్ స్టేడియం అతి పెద్దదని, ఇందులో సింథటిక్ ట్రాక్ నిర్మాణానికి రూ.2.50 కోట్లు మంజూరయ్యాయని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో జాతీయస్థాయి పోటీల నిర్వహణకు ఈ స్టేడియం ఉపయోగపడుతుందన్నారు.

అంతకుముందు ఉదయం పరుగుపందెం, నడక, హైజంప్, లాంగ్‌జంప్, జావెలిన్‌త్రో విభాగాల్లో పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి పతకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పురపాలిక ఉపాధ్యక్షులు అశోక్, తెరాస నాయకులు లింగారెడ్డి, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షులు వెంకటరమణ, కార్యదర్శి మధుసూదన్, పీఈటీ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, శ్రీనివాస్‌రావు, పీడీ మాధవరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, సత్యారావు, పీఈటీలు శ్యాం, గోపాల్‌గౌడ్, నరేశ్, సత్యం, దేవేందర్‌రెడ్డి, గోపాల్, సబ్రిన్, శ్వేత, సుజాత, రాధిక, వినోద్, సుధాకర్, రాజేందర్, మహిపాల్, రూపేందర్ పాల్గొన్నారు.

# బునాదిగాని కాల్వ పూర్తికి మంత్రి హామీ

## మంత్రిని కలిసిన మోత్కూరు అఖిలపక్ష ప్రతినిధులు




మోత్కూరు : మోత్కూరు, ఆత్మకూర్(ఎం), వలిగొండ, భువనగిరి, బీబీనగర్ మండలాలకు సాగునీరందించే బునాదిగానికాల్వ మొదటి, రెండో దశ(ధర్మారం కాల్వ)లను సత్వరమే పూర్తిచేయిస్తానని రాష్ట్ర భారీ నీటిపారుదలశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు హామీనిచ్చారు. శనివారం మోత్కూరు మండల అఖిలపక్ష నాయకులు పలువురు మందుల సామేలు ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని మంత్రి నివాసంలో హరీశ్‌రావుకు వినపత్రాన్ని అందజేశారు. 13 ఏళ్ల క్రితం ప్రారంభించిన బునాదిగానికాల్వ అనేక ఒడుదొడుకుల కారణంగా సకాలంలో నిర్మాణం జరగక తమ ప్రాంతంలో కాల్వ నిర్మాణం ఇంకా పూర్తికాలేదన్నారు. ఈ కాల్వద్వారా భూమి కోల్పోతున్న రైతులకు పరిహారం అందించడంలేదని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కాల్వ నిర్మాణం చేపట్టిన ప్రాంతాలలో 13 ఏళ్లలో భూముల ధరలు విపరీతంగా పెరిగాయని చెప్పారు. పెగిరిన ధరల ప్రకారం రైతులకు పరిహారం అందించాలని అఖిలపక్షం కోరింది. కాల్వను త్వరితగతిన పూర్తిచేయడం వల్ల తమ ప్రాంతంలో సుమారు 10 వేల ఎకరాలకు సాగునీరందుతుందని పేర్కొన్నారు. పరోక్షంగా భూగర్భ జలాలు పెరిగి మరికొంత భూమి సాగులోకి వస్తుందని మంత్రికి విజ్ఞప్తి చేశారు.

ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ బునాదిగానికాల్వ కోసం నిధులను ఇప్పటికే విడుదల చేశామని, సంబంధిత అధికారులతో చర్చించి రైతులకు పరిహారం ఇప్పించేందుకు, కాల్వ సకాలంలో పూర్తిచేయించేందుకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మంత్రిని కలిసిన వారిలో మండల అఖిలపక్షం ప్రతినిధులు వై.దామోదర్‌రెడ్డి, చేడె చంద్రయ్య, బొల్లు యాదగిరి, గుండు వెంకటనర్సు, పైళ్ల యాదిరెడి, ఉమ్మడి జిల్లా టెలికాం బోర్డు సభ్యుడు సీహెచ్.సత్యంగౌడ్, తదితరులు ఉన్నారు.

# శాంతిభద్రతల పరిరక్షణలో ముందున్న పోలీసులు


## మంత్రి జోగు రామన్న



ఆదిలాబాద్ : శాంతి భద్రతల పరిరక్షణలో జిల్లా పోలీసులు ముందంజలో ఉన్నారని రాష్ట్ర అటవీశాఖ మంత్రి జోగు రామన్న అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా సాయుధ పోలీసు ప్రాంగణంలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి హాజరయ్యారు. స్మారక స్తూపంవద్ద తొలుత జ్యోతి ప్రజ్వలనచేసిన అనంతరం మాట్లాడారు. దేశప్రజల రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన 383 మంది జవానులను ఈ దినోత్సవం రోజు తప్పకుండా స్మరించుకోవాలన్నారు. జిల్లా విభజన అనంతరం ఆదిలాబాద్‌లో తొమ్మిది మంది అమరవీరుల కుటుంబాలున్నారని, వారందరికి ఇప్పటికే పిట్టలవాడలో ఇళ్ల నిర్మాణం చేయించి ఇచ్చామన్నారు. జిల్లా పోలీసు ఉన్నతాధికారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో మరిన్ని అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతామన్నారు. అనంతరం జిల్లా పాలనాధికారి బుద్ధ ప్రకాశ్ ఎం జ్యోతి మాట్లాడుతూ జిల్లాలోని తొమ్మిది మంది పోలీసు అమరవీరులు త్యాగాలకు ప్రతీకలని అభివర్ణించారు. అనంతరం స్మారక స్తూపంవద్ద పుష్పగుచ్ఛాతో నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీ నగేష్, పురపాలక అధ్యక్షురాలు మనీష, మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఆరె రాజన్న తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల సంస్మరణ వారోత్సవాల ముగింపు సందర్భంగా ఆదిలాబాద్ పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. మంత్రి జోగురామన్న ర్యాలీని ప్రారంభించారు. సాయుధ పోలీసు ప్రాంగణం నుంచి ప్రారంభమైన ర్యాలీ కలెక్టరేట్, ఎన్‌టీఆర్ చౌక్, వినాయక్‌చౌక్, అశోక్‌రోడ్డు, గాంధీచౌక్ లగుండా వెళ్లి అంబేద్కర్ చౌక్‌లో ముగించారు. ర్యాలీలో జిల్లా పోలీసు ఉన్నతాధికారి శ్రీనివాస్‌తోపాటు నేతలు కస్తాల ప్రేమల, డీఎస్పీ లక్ష్మీనారాయణ, సీఐలు సురేష్, స్వామి, శ్రీనివాస్, సతీష్, ఆర్ఐ జేమ్స్, ఎంటీవో పెద్దయ్య, ఎస్సైలు శ్రీనివాస్, పుల్లయ్య, తిరుపతి, సుబ్బారావు, వెంకటేశ్, పోలీసు అసోసియేషన్ అధ్యక్షులు పెంచాల వెంకటేశ్వర్లు, ప్రతినిధులు తాజొద్దీన్, దేవీదాస్, సిసి పోతరాజు, అమరవీరుల కుటుంబీకులు శివనంద, సంధ్యారాణి, దురీబాయి, హీరాబాయి, తాహెరా బేగం, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలి: డీఈవో



ఖమ్మం : విద్యార్థులు భావిశాస్త్రవేత్తలుగా ఎదగాల్సిన అవసరం ఎంతో ఉందని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.విజయలక్ష్మిబాయి అన్నారు. నగరంలోని ఖమ్మం పబ్లిక్ స్కూల్లో 25వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్‌ను ఆమె జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ విద్యార్థులు సైన్స్ పట్ల అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ కలెక్టరో, డాక్టరో, ఇంజినీరో కావాలనుకుంటారు తప్ప శాస్త్రవేత్తలు కావాలని కోరుకోవటం లేరని అన్నారు. ఈదేశానికి శాస్త్రవేత్తల అవసరం ఎంతో ఉందన్నారు. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో దేశం మరింత అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందన్నారు. బాలల సైన్స్ కాంగ్రెస్ లాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థులు ఎన్నో నూతన ఆవిష్కరణలు చేసే అవకాశం ఉందన్నారు. కొత్త ఆలోచనలతో వారు తయారు చేసిన ప్రాజెక్టుల ద్వారా విద్యార్థుల్లో దాగిఉన్న ప్రతిభ వెలుగులోకి వస్తుంది. ఇలాంటి కార్యక్రమాలకు కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు కూడా ఎంతో విద్యార్థులకు ప్రోత్సాహాన్ని అందజేస్తున్నాయన్నారు. సమాజంలో సైన్స్ పట్ల ఆదరణ పెంచేందుకు విద్యార్థులకు ఇన్‌స్పైర్, ఇతర కార్యక్రమాలు కూడా ప్రభుత్వం చేపడుతోంది. సైన్స్‌లో అద్భుత ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రభుత్వం ఉచిత విద్యను అందిస్తుందని విజయలక్ష్మిబాయి చెప్పారు. డీసీఈబీ కార్యదర్శి కనపర్తి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దేశంలో శాస్త్రవేత్తల కొరత తీవ్రంగా ఉందన్నారు. విద్యార్థులు భావిశాస్త్ర వేత్తలుగా ఎదిగేందుకు సైన్స్ ఎంతో దోహదపడుతుందన్నారు. వ్యసాయరంగంలో మార్పులు తీసుకురావాలంటే అది కేవలం శాస్త్రవేత్తలకు మాత్రమే సాధ్యమవుతుంది. జిల్లా సైన్స్ అధికారి సైదులు మాట్లాడుతూ విద్యార్థుల్లో సైన్స్ పట్ల ఆసక్తిని పెంచేందుకు ప్రాథమిక స్థాయి నుంచే ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. తెలంగాణలో జాతీయ, రాష్ట్రస్థాయి సైన్స్ ప్రదర్శనలు జరుగుతున్నాయన్నారు. జిల్లా నుంచి సాధ్యమైనంత వరకు ఎక్కువ మంది విద్యార్థులను ప్రదర్శనలకు పంపించాలన్నారు. ఈకార్యక్రమంలో ఖమ్మం పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ కిశోర్‌కుమార్, బాలల సైన్స్ కాంగ్రెస్ జిల్లా సమన్వయకర్త ఇనుముల వెంకటేశ్వర్లు, అదనపు సమన్వయకర్త డాన్‌బోస్కో, నీటి పారుదలశాఖ డీఈ వెంకటేశ్వర్లు, డివిజన్ కార్పొరేటర్ హనుమాన్, నాయకుడు నాగుల్ మీరా, తదితరులు పాల్గొన్నారు.

తొలుత విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రాజెక్టులతో వచ్చిన విద్యార్థులు, వారి గైడ్ ఉపాధ్యాయులతో పాఠశాల ప్రాంగణం కళకళలాడింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు కూడా విద్యార్థులు తమ ప్రదర్శనలను న్యాయనిర్ణేతల ఎదుట ప్రదర్శించారు. కొత్త కొత్త ప్రాజెక్టులు ఈసారి ప్రదర్శనల్లో ఆకట్టుకున్నాయి.

అందం

# ఆకర్షించే 'మెడ'కోసం



అందంగా, మృదువుగా కనిపించే 'మెడ' భాగాన్ని ఆరోగ్యంగా ఉంచేందుకు జాగ్రత్తలు తప్పనిసరి. మెడమీది చర్మం సున్నితంగా ఉంటుంది కాబట్టి బరబరా రుద్ది శుభ్రం చేయకూడదు. జుట్టు నుంచి మెడకు అంటుకునే జిడ్డును తొలగించేందుకు స్నానం చేసేటప్పుడు ప్రత్యేకంగా దృష్టిపెట్టాలి.

ఎండల్లో తిరిగినప్పుడు ఇంటికి రాగానే వేడినీటితో మెడను శుభ్రం చేసుకోవాలి. ఆ తర్వాత మెత్తని టవల్‌తో తుడుచుకోవాలి. గిల్ట్ నగలు ధరించటంవల్ల నల్లటి మచ్చలు వచ్చే అవకాశం ఉంటుంది. వాటివల్ల దురదలు కూడా వస్తాయి. కాబట్టి వేసవికాలంలో గిల్టు నగలను ధరించకపోవడం ఉత్తమం.

మెడ భాగానికి ఆలీవ్ ఆయిల్ రాసి మసాజ్ చేయడంవల్ల ఆ ప్రాంతమంతా నున్నగా, మృదువుగా ఉంటుంది. రాత్రి పడుకోబోయేందుకు ముందుగా ఆలీవ్ నూనెను రాసి, ఉదయాన్నే లేచిన వెంటనే గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకుంటే మంచి ఫలితం కనిపిస్తుంది

రోజుకు కనీసం రెండుసార్లు మూడు లేదా నాలుగు నిమిషాలపాటు మెడను పైకి ఎత్తడం, వంచడం, అటూ ఇటూ తిప్పడం చేయాలి. ఇందువల్ల మెడ కండరాలు చక్కగా పనిచేస్తాయి. కొద్దిగా గ్లిజరిన్ తీసుకుని అందులో కొన్ని నిమ్మరసం చుక్కలు కలపాలి. ఈ మిశ్రమాన్ని రాత్రిపూట పడుకునేటప్పుడు మెడకు రాసి, ఉదయాన్నే శుభ్రం చేసుకుంటే, కొద్దిరోజుల్లోనే మెడ మెరిసిపోతుంది.

## రింగురింగుల జుట్టుతో జాగ్రత్తసుమా!



రింగు రింగుల జుట్టు సాధారణంగా ఉండే జుట్టుకంటే పెళుసుగా ఉండటమేగాకుండా, పొటిపొడిగా ఉంటుంది. కాబట్టి రింగుల జుట్టు ఉన్నవారు ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకోవాల్సి ఉంటుంది. రింగుల జుట్టు ఉన్నవారు షాంపూతో వారానికి ఒక సారైనా తప్పకుండా తలస్నానం చేయాలి. దానివల్ల తలలో చర్మం, వెంట్రుకలు జిడ్డులేకుండా ఉంటాయి. తలస్నానానికి మాయిశ్చరైజింగ్ షాంపూ అయితే మరీ మంచిది. ఇది జుట్టు పొడిపొడిగా ఉంచేందుకు సహకరిస్తుంది. వారంలో వీలనైనన్ని సార్లు షాంపూతో తలస్నానంచేస్తే రింగుల జుట్టు జిడ్డులేకుండా ఆరోగ్యంగా ఉంటుంది. అయితే స్నానం చేసిన తరువాత రింగుల జుట్టును సహజంగానే గాలికి ఆరనివ్వాలి. అలాకాకుండా డ్రయ్యర్‌నుగనుక వాడితే జుట్టు విరిగిపోయే ప్రమాదం ఉంటుంది. అసలే రింగు రింగులుగా ఉన్న జుట్టు మరింతగా రింగులు తిరగకుండా ఉండేందుకు యాంటిఫ్రిజ్ సిరమ్‌ను ఉపయోగించటం ఉత్తమం. ఈ సిరమ్‌ను జుట్టు కుదుళ్లనుంచీ రాస్తే సరిపోతుంది.

## నల్లగా ఉన్నారని బాధపడుతున్నారా...?

మహిళలు నల్లగా ఉన్నారని బాధపడుతున్నారా.. అయితే ఇక మీరు బాధపడాల్సిన పనిలేదు. నల్లగా ఉన్నవాఉ మీగడలో పసుపు కలుపుకుని ప్రతిరోజూ చర్మానికి రాసుకుంటే మెరిసే ఛాయను పొందుతారని బ్యూటీషియన్లు అంటున్నారు. మీగడలో పసుపు కలిపి ప్రతిరోజూ చర్మానికి రాసుకుని పది నిమిషాల తర్వాత మెత్తగా, నెమ్మదిగా అక్కడక్కడ మసాజ్ చేస్తే రంగులో తేడా గమనించవచ్చు. నిమ్మ, తులిస ఆకుల రసం సమ పాళ్లలోకలిపి రోజుకు రెండుసార్లు ముఖానికి పట్టించాలి. 20 నిమిషాల తర్వాత చల్లటి నీటితో ముఖం కడుక్కోవాలి. అలాగే బంగాళాదుంపల రసం తీసిముఖానికి రాసుకుని 20 నిమిషాల తర్వాత చల్లని నీటితోకడిగేయాలి.

## మీనాల్లాంటి 'కన్నుల' సంరక్షణ ఎలా..?



వంటగదిలో పనిలో ఉన్నప్పుడో లేదా ఇంటి పనుల్లో నిమగ్నమై ఉన్నప్పుడో కంట్లో నలుసు పడితే.. చేత్తో నలపటంకానీ, రుద్దటంకానీ చేయవద్దు. అలా చేస్తే చేతికి ఉండే మట్టి, ధూళికణాలు, సూక్ష్మక్రిములు కంట్లో చేరి అలెర్జీ, ఇన్‌ఫెక్షన్లను కలిగించే ప్రమాదం ఉంటుంది. కంట్లో నలకపడితే వెంటనే చేతులను శుభ్రం చేసుకుని చేతివేళ్లతో నీటిని కళ్లపై చిలకరించి మెత్తని, శుభ్రమైన గుడ్డతో కళ్లు తుడిస్తే సరిపోతుంది. కళ్లను రోజుకు వీలైనంత వరకు రెండుసార్లుకంటే ఎక్కువ కడుగకూడదు. కంటికి సరిపడా నిద్ర, విశ్రాంతి ఇవ్వడం చాలా అవసరం. కంటి అందాన్ని పెంచేందుకు వాడే వస్తువులు సాధ్యమైనంతవరకు కంపెనీ ఉత్పత్తులనే వాడాలి. కాటుక దిద్దిన కళ్లచూపు చాలా శృంగార భరితంగా ఉంటుంది. అయితే కాటుక పెట్టుకునేటప్పుడు చేతివేళ్లు శుభ్రంగా లేకపోతే క్రిములు కంట్లోకి ప్రవేశించి లోపలి భాగాలు దెబ్బతినే ప్రమాదముంది. అందువల్ల చేతులు శుభ్రంగా ఉండేలా చూసుకోవాలి.

కనురెప్పల వెంట్రులకు నలుపు రంగుతో సింగారిస్తే కళ్లు పెద్దవిగా చాలా అందంగా ఉంటుంది. కళ్లకు మంచి షేప్ రావడంకోసం ఐ లైనర్‌ను వాడతారు. దీన్ని వాడేటప్పుడు కంట్లో చిన్న చుక్క కూడా పడకుండా ఉండేలా జాగ్రత్తపడాలి. కంటి మేకప్ అవసరం తీరిన తర్వాత తొలగించేటప్పుడు జాగ్రత్తగా ఉండకపోతే కళ్లకు ప్రమాదం జరగవచ్చు. కొంతమంది మేకప్ తొలగించేందుకు దూదిని నీటిలో ముంచి శుభ్రం చేస్తుంటారు. ఇది సరైన పద్ధతికాదు. మేకప్‌ను తొలగించేందుకు తయారైన ప్రత్యేకమైన ఆయిల్‌ను మాత్రమే ఉపయోగించాలి లేదా బేబీ ఆయిల్ వాడాలి.

## కంటి కింద నల్లవలయాల నివారణకు...

ప్రస్తుత కాలంలో చాలా మంది కళ్లజోడును ధరిస్తున్నారు. కళ్ళజోళ్ళు దీర్ఘకాలం పాటు వేసుకోవడం వల్ల ముక్కుమీద నల్లని చారలు శాశ్వత మచ్చలుగా అభివృద్ధికి దారితీస్తుంది. కళ్లజోడును ధరించడం దీర్ఘకాలం పాటు పాటిస్తున్నట్లైతే అది ఒక అలవాటుగా మరుతుంది. కళ్ల జోడు ధరించడం వల్ల ఏర్పడే ముక్కుమీద నల్లని మచ్చలను తొలగించడానికి అవకాశం ఉంది. అందుకు కొన్ని హోం రెమడీస్ మరియు బేసిక్ టిప్స్ ఉన్నాయి. ఇవి ముక్కు మీద మచ్చలను తొలగించడం మాత్రమే కాదు తిరిగా అటువంటి మచ్చలు ఏర్పడకుండా నివారిస్తాయి. క్రింద ఇవ్వబడ్డ కొన్ని హోం రెమడీస్ కంటి అద్దాలు పెట్టుకోవడం వల్ల ముక్కుమీద ఏర్పడ్డ నల్ల మచ్చలను తొలగించుకోవచ్చు.

**హీలింగ్ ప్రోత్సహించండి ..**

మీరు కంటి అద్దాలు నిరంతరం పెట్టుకొంటున్నట్లైతే.. ముక్కమీద నల్లమచ్చలు రాకుండా ఉండాలంటే రోజులో అప్పడప్పుడు కళ్ల అద్దాలు పెట్టుకోకుండా కళ్లకు విశ్రాంతి కలిగించండి. దాంతో నల్ల మచ్చలు ఏర్పడవు ఆ ప్రదేశంలో బ్యాక్టీరియా మరే ఇతర ఇన్ఫెక్షన్లు కలగకుండా మిమ్మల్ని కాపాడుతుంది. మీ చర్మాన్ని ముఖ్యంగా ముక్కు మీద రోజుకు రెండు సార్లు శుభ్రం చేసుకోవడం వల్ల నల్లమచ్చలను నివారించవచ్చు. దాంతో ముక్కుమీద ఎరుపుదనం తగ్గుతుంది. దురద ఇతర ఇన్ఫెక్షన్లు రాకుండా నివారిం చుకోవచ్చు. మరియు మచ్చలు పూర్తిగా తొలగి పోతాయి.

**మాయిశ్చరైజింగ్..**

మచ్చలు కల్యాజ్ఞ్ కణజాలం వల్ల ఏర్పడుతాయి. కాబట్టి వీటికి రెగ్యులర్ మాయిశ్చ రైజర్ అప్లై చేయడం వల్ల ఆ ప్రదేశం తేమగా మారి చర్మానికి రక్షణకల్పిస్తుం ది. ఇది చివరికి మచ్చలు తొలగింపునకు దారి ంతీస్తుంది. ఇది క్రమం తప్పకుండా రోజుకు రెండు సార్లు ముక్కుమీద మాయిశ్చరైజర్ రాయడం వల్ల నల్ల మచ్చలు, చారలు పూర్తిగా నయం అవుతాయి.

**నేచురల్ బ్లీచింగ్..**

మచ్చలు ఏర్పడ్డ ప్రాతంలో బ్లీచింగ్ చేయించుకోవడం వల్ల సాధారణ చర్మంతో పోల్చితే ఆ ప్రాంతంలో మరింత కాంతివంతంగా కనిపిస్తుంది. రసాయ నాలతో బ్లీచింగ్ చేయించుకోవడం కంటే సహజంగా టమోటో లేదా బంగాళదుంపల స్లైస్ తో ముక్కు మీద రుద్దడం వల్ల మచ్చలను మాయం చేసుకోవచ్చు.

వీటిని ఉపయోగించే టప్పుడు తప్పనిసరిగా తాజాగా ఉన్నవి ఎంపిక చేసుకోవాలి.

**టోనర్ అప్లై చేయాలి..**

చర్మానికి సరైన రెగ్యులర్ టోనింగ్ చేయించుకోవడం వల్ల ఇది మరో మంచి పద్ధతి. కంటి అద్దాలు రెగ్యులర్ గా ఉపయోగించడం వల్ల ఏర్పడ ముక్కుమీద మచ్చలు పూర్తిగా నివారించ దలుచు కొన్నట్లైతే టోనర్‌ను తరచూ అప్లై చేస్తుండాలి. టోనర్ రాయడం వల్ల చర్మం మరింత స్ట్రాంగ్‌గా సాగే గుణాన్ని కలిగించడంతో ఈ హెల్తీ స్కిన్ మీద మచ్చలు ఏర్పడటానికి అవకాశం ఉంటుంది.

**నేచురల్ రెమడీస్ ..**

సహజ చిట్కాలు అంటే కీర దోసకాయ ముక్కలు, విటమిన్ ఇ బాదాం ఆయిల్ ఓట్ మీల్-పాల మిశ్రమం తేనె వంటివి రెగ్యులర్ గా చర్మంమీద అప్లై చేయాలి.

అలా రుద్దడం వల్ల కంటి అద్దాలు పెట్టుకోవడం వల్ల ఏర్పడ్డ మచ్చలను సులభంగా తొలగించుకోవచ్చు.





# ఇబ్బందిపెట్టే గురక

మన పక్కన పడుకున్న వాళ్లు ఎవరైనా గురక పెడుతుంటే మనకు నిద్ర పట్టదు. గురకలు కూడా రకరకాలుగా పెడుతుంటారు. కొన్ని గురకలు భయాన్ని పుట్టిస్తాయి. పాశ్చాత్య దేశాల్లో మొగుడి గురక తట్టుకోలేక విడాకులకై కోర్టులకు పరుగెత్తిన వాళ్లూ ఉన్నారు. గురక పెట్టేవాళ్ళు రాత్రి సరిగ్గా నిద్రపోక పగలు కునికి పాట్లు పడుతూ వాహనాలు నడిపేటప్పుడు యాక్సిడెం ట్లు చేస్తారని పలు అధ్యయనాల్లో తేలింది.




**గురక అంటే ఏమిటి?**

శ్వాస లోపలికి తీసుకునేప్పుడు ముక్కు నుంచి స్వరపేటిక వరకు ఎక్కడైనా నాళాలు సన్నబడ్డా, శ్వాసద్వారాలు మూసుకుపోయినా, గాలి లోపలికి బలవంతాన తీసుకుంటున్న ప్పుడు వచ్చే శబ్దమే గురక. నాళాలు సన్నగా ఉండడంతో బలవంతాన గాలి తీసుకోవాల్సి వస్తుంది కాబట్టి గురకలో గాలి ఎక్కువ తీసుకుంటు న్నారేమో అనిపిస్తుంది చూసేవారికి. గొతులో ఉండే కండరాల బిగువు తగ్గినప్పుడు అంగిట్లో చివరి భాగాన ఉండే కండరం సాఫ్ట్ పాలట్‌తో బాటు చుట్టుపక్కల ఉన్న ఫారింక్స్ కండ రాలు, కొండ నాలుక బలంగా లోప లికి పీల్చే గాలి వల్ల కంపిస్తాయి. ఈ కంపనం వల్ల వచ్చే శబ్దమే గురక.



నిద్రలో బలవంతాన తీసుకున్న గాలిని తిరిగి సన్నని శ్వాసనాళాల ద్వారా బయటకు నెట్టడం కష్టమైనిశ్వాస నోటి ద్వారా కూడా జరుగుతుంటుంది. అప్పుడు పెదాలు కంపించి కొన్ని రకాల శబ్దాలు వస్తుంటాయి. ముక్కు దూలం వంకరగా ఉన్నా, అడినాయిడ్స్, టాన్సిల్స్ ఉన్నా శ్వాసమార్గం సన్నబడుతుంది. ఊపిరి తేలిగ్గా లోపలికి వెళ్ళదు. గురక వల్ల నిద్ర సరిగ్గా పట్టదు. మెలకువగా ఉన్నప్పటికన్నా నిద్ర పోయేటప్పుడు శ్వాస సరిగా ఉండేట్లు శస్త్రచికిత్స చేయించుకోవాలి. అడినాయిడ్స్, టాన్సిల్స్ గాని ఉంటే తీయించాలి. థైరాయిడ్ వ్యాధి ఉన్న వాళ్ళు థైరా యిడ్ హార్మోన్లు తీసుకోవాలి. ఊబకాయంతో బాధపడేవారు బరువు తగ్గించుకోవాలి. నిద్ర, నిద్రకు సంబంధించిన రుగ్మతపై అవగాహన పెరుగుతున్న తరుణంలో శ్వాససంబంధిత వ్యాధులు- గురక ఈ రుగ్మతలలో భాగమేనని గుర్తించారు. నిద్రలో 10 సెకన్ల పాటు శ్వాస ఆగిపోవడాన్ని అప్నియా అని, 50 శాతం కంటే తక్కువ గాలి పీల్చడాన్ని హైపోప్నియా అని అంటారు. వీటికి తోడు రక్తంలో ఆక్సిజన్ పరిమాణం కూడా బాగా తగ్గుతుంది. అబ్‌స్ట్రక్టివ్ స్లీప్ అప్నియా (ఒఎస్ఎ) శ్వాస ప్రక్రియ జరుగుతున్నా ముక్కు- గొంతుకలో అడ్డంకుల వల్ల శ్వాస ఆగిపోతుంది. ఆ తరువాత గురక రావడం ఒక సైకిల్‌గా వస్తుంది.

## వేసవిలో జాగ్రత్తలు

వేసవిలో చర్మాన్ని కాపాడుకోవడం కోసం అన్ని వేళలా తగిన క్రీములు, ఫేస్ ప్యాక్ లు వేసుకోవడం వంటివి చేయాలి. తరచూ ముఖాన్ని చల్లని నీటితో కడిగి శుభ్రం చేసుకో వాలి. అలాగే ముఖంపై ఉండే మృతకణాలను తొలగించుకునేందుకు ప్రయత్నించాలి.

ఉదయాన్నే లేచి మీ ముఖాన్ని కొబ్బరి నీళ్లతో కడుకొంటే ముఖం ఫ్రెష్ గా కాంతివంతంగా తయారవుతుంది. చర్మం సంరక్షణలో అలోవెరా గుణాలు కలిగిన సన్ స్క్రీన్ ను రాసుకోండి. చర్మానికి కావలసిన తేమ అందుతుంది. తాజా పండ్లు, పండ్లరసాలు, చల్లని మజ్జిగను తాగాలి. పండ్ల రసాలను తాగడమే కాకుండా వీలైతే పండ్ల గుజ్జుతో ఫేస్ ప్యాక్ వేసుకోవాలి. తద్వారా పండ్ల గుణాలు మీ చర్మానికి చేరతాయి. ముఖంతో పాటు, చేతులు, కాళ్లు, కేశాలు మిగతా శరీర భాగాలను ఎండ నుంచి కాపాడుకోవాలి. ఇందుకోసం విటమిన్లు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలి. శరీరాన్ని పటిష్టంగా ఉంచుకునేందుకు ప్రతిరోజూ వ్యాయామం చేస్తూ బ్యాలెన్డు ఆరోగ్యాన్ని సొంతం చేసుకోండి.

# సుఖవంతమైన నిద్రతో ఆరోగ్యం



నిద్ర సుఖమెరగదు. ఎక్కడ పడుకుంటే ఏం అనుకునే వాళ్ళ సంఖ్యం ఎక్కువే కానీ ఎలా పడితే అలా పడుకుంటే ఉన్న నిద్ర కాస్త ఎగిరిపోతుంది. పరిసరాలను మైమరచి కునుకు తీయాలంటే మెత్తని పరుపు ఉండాల్సిందే. ఆదమరచి నిదురపోవడంలో ఉండే ఆనందం అంతా ఇంతా కాదు. పానుపు మెత్తగా ఉండే సౌకర్యంగా ఉంటే ఇక మీ ఇంట్లో టీవీ చుట్టూ ఎవరూ చేరరు. అంతా మంచంమీదే కబుర్లు చెప్పుకుంటారు.

అంత మహిమ గల పరుపులు ఏమున్నాయనేగా మీ సందేహం! దూది పరుపులు, పీచు పరుపుల స్థానానే ఇప్పుడు మార్కెట్‌లో టెక్నాలజీ పరుపులు సిద్ధమై వూరిస్తున్నాయి. పడుకోగానే మెత్తగా కూరుకుపోయే మెమెరీ ఫోమ్ పరుపులొచ్చాయి. మేఘాలలో తేలిపోతున్న అనుభూతినిచ్చే లాటెక్స్ పరుపులున్నాయి. ఎలా కావాలంటే అలా మనల్ని ఒదిగిపోయేలా చేసే ఎల్రక్టిక్ పరుపులొచ్చాయి. నిజంగానే గాలిలో తేలేలా చేసే గాలి పరుపులూ ఉన్నాయి.

**మీరు మెచ్చేట్లు..**

మీకు ఎలాకావాలంటే అలా ఒదిగిపోయే పరుపు కావాలంటే మెమొరీ ఫోమ్‌ని ఎంచుకోవాల్సింది. మీ బరువు ఆకారాన్ని బట్టి పరుపు దానంతట అదే అడ్జెస్ట్ అవుతుంది.అంతేకాకుండా ఇది ఉష్ణోగ్రతకు అనుగుణంగా మార్పులు చెందుతుంది. ఎక్కువ ఉష్ణోగ్రత వద్ద సాఫ్ట్‌గాను తక్కువ ఉష్ణోగ్రత వద్ద గట్టిగాను మారుతూ ఉంటుంది. అంటే మీ బాడీ టెంపరేచర్, మీ శరీరాకృతి, బరువులను బట్టి మీకు సౌకర్యంగా తన రూపును మార్చుకుంటుంది. ఇది నిజంగా ఒక అద్భుత సృష్టి అనే చెప్పాలి. దీనివల్ల చాలా లాభాలు కూడా ఉన్నాయి.ఈ ఫోమ్ బెడ్ మీద ఎంత మంది పడుకున్నా అందరికీ కమ్‌ఫర్ట్‌గా ఉంటుంది. సాధారణంగా భార్యాభర్తలు పడుకున్నపుడు ఇద్దరి బరువూ ఒకేలా ఉండదు కనుక ఇద్దరిలో ఎవరో ఒకరు కదులుతూనే ఉంటారు. ఇది మరొకరికి విసుగ్గా ఉంటుంది. ఈ మెమొరీ బెడ్ పై పడుకుంటే ఈ సమస్యలే ఉండవు. ఎందుకంటే ఎవరి బరువుకు తగ్గట్టు వారి ఆకృతి ఏర్పడిపోతుంది కనుక. చాలా మంది నిద్దర్లో మెడ పట్టేసింది, నడుం పట్టేసిందని అంటుం టారు. కాని ఈ ఫోమ్ మీ మెడ, నడుంనొప్పులను ఇట్టే తీసేస్తుంది.వెన్నుముకకు మంచిది. మొత్తానికి ఇది మీ తలనుండి కాళ్ళ వరుకు ఎంతో సపోర్టింగ్‌గా ఉంటుంది. ఇన్ని సౌకర్యాలు ఉన్న ఈ బెడ్ చాలా ఖరీదేమో అనుకోకండి. సామాన్యులకు కూడా దీని ధర అందుబాటులోనే ఉంది.

**మీ వెంటే**

మూవింగ్ బెడ్‌పైపై పడుకుంటే బంతిలా ఎగురుతారు.దీనిలో స్ప్రింగ్ లు ఉండవు కాని బౌన్స్ అవుతారు. దీనిలో ఎక్కువ పొరలు ఉండడం వలనే ఇది ఇంత మెత్తగా ఉండడానికి కారణం.గదిలోని ఉష్ణోగ్రతను బట్టి దాని తత్వాన్ని మార్చుకుంటుంది.ఇది చాలా తేలికగా ఉండడం వలన ఎక్కడికైనా తీసుకువేళ్ళే అవకాశం ఉంటుంది. నిద్రలేమితో బాధపడుతున్న వారికిది సరైన మందు. డాక్టర్లు కూడా వీటినే వాడమని చెబుతున్నారు. ఏఏమైనా సర్జరీలు చేయించుకున్న వాళ్ళకి చేయించుకునే వాళ్ళకి ఇది చాలా సౌకర్యంగా ఉంటుంది. శరీరంలోని అన్ని భాగాలకు రక్త ప్రసరణ బాగా జరిగేవిధంగా చేస్తుంది. నిద్రలో ఉన్నపుడు శ్వాస తీసుకోవడంలో ఏమైనా సమస్యలున్నా ఈ అడ్జస్టబుల్ బెడ్ వలన ఉపశమనం కలుగుతుంది.

**ఎయిర్ బెడ్** ఒకసారి ఈ బెడ్‌పై పడుకుంటే మరే బెడ్‌పై పడుకోడానిక ఇష్టపడరు. ఈ బెడ్ మొత్తం ఖరీదైన యాంటీ మైక్రో బయల్ కాటన్‌తో కప్ప బడి ఉంటుంది. దీని అడుగు భాగంలో గ్రిప్‌టైట్ నాన్ స్లిప్ అమర్చి ఉంటుంది. బెడ్‌ని శుభ్రం చేసుకునేటప్పుడు ఈ కవర్‌ను తీసేయొచ్చు. ఇది గాలితో నిండి ఉండేది కనుక గదిలో ఎక్కడ కావాలంటే అక్కడ సులువుగా దీనిని పెట్టుకోవచ్చు. ఈ బెడ్ పై మీరు ఎలా పడుకోవలనుకుంటే అలా మీకు అనుగుణంగా ఉంటుంది. మెడ, నడుము నొప్పులకు ఇక టాటా చెప్పేయొచ్చు.

**సొంతింటి మసాజ్** దీని పేరు కంట్రోల్ బెడ్. ఇది మీ తల నుండి కాలి వరుకు మీకు ఎన్ని వందల రకాల మలుపులు తిప్పాలనుకుంటే అన్ని రకాల ఆకారాలలో పెట్టుకోవచ్చు. ఇదంతా ఒక చిన్న కంట్రోల్‌తో సాధ్యం. మీబెడ్‌కి ఒక సందేశం ఇచ్చిశరీరానికి మసాజ్ చేయిం చుకోవచ్చు. వైర్‌లెస్ చేతి రిమోట్ ద్వారా ఈ సందేశాలన్నీ ఇవ్వొచ్చు. ఈ ఎలక్ట్రికల్ సామాగ్రి అంతా బెడ్ అడుగు భాగంలో అమర్చబడి ఉంటుంది.

# చిత్రభాను

## ఇంటికో జవాన్



దేశభక్తి అనేది కిరీటం కాదు. కృతజ్ఞత. ప్రతి ఒక్కరికీ వుండాల్సిన గొప్ప బాధ్యత. దేశంకోసం, తమ కుటుంబం కోసం ప్రతి ఒక్కరు ఓ జవాన్‌లా పనిచేయాలి. అదే మా చిత్ర ఇతివృత్తం అన్నారు బి.వి.ఎస్.రవి. ఆయన దర్శకత్వంలో సాయిధరమ్‌తేజ్, మెహరీన్ జంటగా నటిస్తున్న తాజా చిత్రం జవాన్. దిల్‌రాజు సమర్పణలో అరుణాచల్ క్రియేషన్స్ పతాకంపై కృష్ణ? నిర్మిస్తున్నారు. డిసెంబర్ 1న ప్రపంచవ్యాప్తంగా విడుదలకానుంది. ఈ సందర్భంగా దర్శకుడు చిత్ర విశేషాలు తెలియజేస్తూ దేశానికి జవాన్ ఎంత అవసరమో, ప్రతి ఇంటికి మా సినిమాలోని కథానాయకుడులాంటి వారు అవసరం అనే పాయింట్‌ను ఈ చిత్రంలో ఆవిష్కరించాం. ఓ మధ్యతరగతి యువకుడు మనోధైర్యంతో, బుద్ధిబలంతో తన కుటుంబాన్ని ఎలా కాపాడుకున్నాడన్నదే చిత్ర కథ. దేశభక్తి, కుటుంబ అనుబంధాలు మేళవించిన వాణిజ్య చిత్రమిది అన్నారు. దిల్‌రాజు మాట్లాడుతూ నటుడిగా సాయిధరమ్‌తేజ్‌ను మరో మెట్టెక్కించే చిత్రమిది. టైటిల్‌కు అనుగుణంగా అద్భుతమైన కథతో తెరకెక్కించాం. సంభాషణలు ప్రతి ఒక్కరిని ఆలోచింపజేస్తాయి. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి అన్నారు. సామాజిక సందేశం మేళవించిన ఈ చిత్రం అన్ని వర్గాల వారిని ఆకట్టుకుంటుందని, భారీ స్థాయిలో ఈ చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామని నిర్మాత తెలిపారు. ప్రసన్న, జయప్రకాష్, ఈశ్వరీరావు తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: కె.వి.గుహన్‌బీ సంగీతం: తమన్, ఆర్ట్: బ్రహ్మ కడలి, కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, దర్శకత్వం: బి.వి.ఎస్.రవి.

## ఆ ప్రాజెక్ట్ నుంచి తప్పుకున్న దిల్ రాజు



ఇన్నాళ్లు 30 నుండి 50 కోట్ల బడ్జెట్ మాత్రమే పెట్టి సినిమాలు తీస్తూ చిన్న సినిమాలతోనే పెద్ద రికార్డులు కొట్టిన దిల్ రాజు 180 కోట్ల బడ్జెట్ తో భారతీయుడు ప్రాజెక్ట్ చేయటానికి పూనుకున్నాడు అనగానే. అంతా ఆసక్తిగా చూసారు. కమల్ హసన్, శంకర్ కాంబినేషన్ లో వచ్చిన సినిమా భారతీయుడు. దాదాపు రెండు దశాబ్దాల క్రితం సంచలనాలు సృష్టించిన ఆ సినిమా సీక్వెల్ గా ఎన్నో ప్రయత్నాలు జరిగినా కాని అది కుదరలేదు. ఫైనల్ గా భారతీయుడు-2కు రంగం సిద్ధమైంది. తెలుగు నిర్మాత డిస్ట్రిబ్యూటర్ దిల్ రాజు ఆ సినిమా నిర్మిస్తున్నారని అఫిషియల్ గా చెప్పేశారు. 180 కోట్ల బడ్జెట్ తో వస్తున్న ఈ సినిమా తన కెరియర్ లోనే అత్యంత భారీ బడ్జెట్ సినిమా తీయటానికి ఒప్పుకున్నాడు దిల్ రాజు. 1996లో కమల్ హసన్ ప్రధాన పాత్రలో దర్శకుడు శంకర్ రూపొందించిన చిత్రం 'భారతీయుడు'. అప్పట్లో ఈ సినిమా ఘన విజయాన్ని సాధించింది. కమల్ హసన్‌కు ఎన్నో అవార్డులు తెచ్చి పెట్టింది. ఉత్తమ నటుడు విభాగంలో జాతీయ పురస్కారాన్ని సైతం అందుకున్నారు. అయితే చాలా కాలంగా ఈ సినిమాకు సీక్వెల్‌ను తెరకెక్కించనున్నారని వార్తలు వస్తున్నాయి. భారతీయుడు చిత్రాన్ని నిర్మించిన ఏఎమ్ రత్నం కూడా గతంలో ఈ సినిమాకు సీక్వెల్ ఉంటుందని వెల్లడించారు. అయితే చాలాకాలం గడిచిపోయింది. ఇక ఆ రెండో పార్ట్ సంగతే అంతా మర్చిపోయాక మళ్ళీ ఆ ప్రాజెక్ట్ ని తెరమీదకి తెచ్చే ప్రయత్నాలని మొదలు పెట్టారు. అందులో భాగంగానే దిల్ రాజు ఈ ప్రాజెక్ట్ నిర్మాతగా మారాడు.. అయితే సడెన్ గా ఏమయ్యిందో ఏమో గానీ అయితే తాజాగా ఆ సినిమా నుంచి దిల్ రాజు తప్పుకున్నట్టు వార్తలు వస్తున్నాయి. శంకర్, కమల్‌హాసన్ కాంబినేషన్‌లో భారీ బడ్జెట్‌తో ఇప్పట్లో సినిమా తీయడం మంచి ఆలోచన కాదని భావించడం వల్లే ఆ సినిమా నుంచి దిల్ రాజు తప్పుకున్నారట.

## సంజయ్‌దత్ కూతురు ఇంతలా...




బాలీవుడ్ స్టార్స్ అందరిలో స్టైల్ అండ్ సెక్సీ మాన్ ఎవరు అంటే ఇప్పుడు చాలా పేర్లు వస్తాయి. కానీ కొన్ని ఏళ్ళు కిందట ఇదే ప్రశ్న వేస్తే ఎక్కువ మంది ఎన్నుకొనేది మాత్రం సంజయ్ దత్ నే. అతని అభిమానులు ముద్దుగా సంజు బాబా అని పిలుచుకుంటారు. చూడానికి కొంచం మొరటోడు మొండోడు లా కనిపించినా అందరితో ప్రేమగా స్నేహానికి ప్రాణం ఇచ్చే మనిషిగా చెప్పుకుంటారు. అలాంటి వాడు కూతురుని ఎలా ప్రేమిస్తాడో మనం ఊహించుకోవచ్చు. సంజయ్ దత్ మొదటి భార్య రిచా శర్మ కూతురు త్రిశాల. రిచా కేన్సర్ వ్యాధితో మరణించిన విషయం తెలిసిందే. మోస్ట్ గ్లామరస్‌గా ఉన్న ఆమెను తమ సినిమాల ద్వారా సిల్వర్ స్క్రీన్‌కు పరిచయం చేయాలని చాలామంది బాలీవుడ్ నిర్మాతలు ఆసక్తి కనబరుస్తున్నారు. దీంతో గత ఏడాది కొంచెం బొద్దుగా కనిపించిన ఈమె సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చేందుకు భారీ కసరత్తే చేస్తోంది. అందుకోసం కఠినమైన ఆహార నియమాలతో పాటు, మరోవైపు జిమ్లో వర్కౌట్స్ చేస్తోంది. ఫిట్‌నెస్‌పై ఉన్న మక్కువతో ఈ అమ్మడు తన ఆనందాన్ని సోషల్ మీడియాలో ఎక్స్‌ప్రెస్ చేసింది. ఈ ఫోటోకు 10,020 లైక్‌లు కూడా సొంతం చేసుకుంది. సో త్రిషాల కూడా త్వరలోనే బాలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చేందుకు సిద్ధం అన్నట్లు ఈ ఫోటోల ద్వారా ఫీలర్స్ ఇచ్చేస్తోంది అయితే సంజయ్ కి తన కూతురు నటి కావటం అంతగా ఇష్టం ఉన్నట్టు కనిపించదు. తండ్రీకూతుళ్ల మధ్య అనుబంధం నేపథ్యంలో తెరకెక్కుతున్న తన సినిమా 'భూమి' గురించి ఇంటర్వ్యూ ఇచ్చిన సంజయ్ దత్ చిత్రంలో తన కూతురి పాత్ర గురించి, నిజజీవితంలో తన కూతురి త్రిశాల గురించి మాట్లాడుతూ "మా త్రిశాల నటి కావాలని కలలు కంటోంది. కానీ నేను తన కాళ్లు విరగ్గొడదాం అనుకుంటున్నా" అని సంజయ్ వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే కదా. ఇప్పటికే కూతురు త్రిశాలా దత్ సినిమాల్లోకి రావడం తనకు ఇష్టంలేదని పబ్లిక్ గా చెప్పేసిన సంజయ్.. అసలు ఆమె మనస్సులో ఏముందో మాత్రం అడిగి ఉండడు. ప్రస్తుతం త్రిషాల న్యూయార్క్ నగరంలో చదువుకుంటోంది. ఫ్యూచర్ లో సైకాలజిస్ట్ అవుతాను అంటూ చెబుతున్నా కూడా.. ఎప్పటికప్పుడు ఆమె తన హాట్ ఫోటోలను పోస్టు చేస్తుంటే మాత్రం నెటిజన్లకు మతిపోతుందనే చెప్పాలి.

## సినిమాను బ్రతికించండి ప్లీజ్: అనిల్ రావిపూడి

ఇంటర్నెట్ అందరికీ అందుబాటులోకి వచ్చిన తర్వాత పైరసీ జోరు కూడా బాగా పెరిగింది. సినిమా విడుదలైన రోజే ఇంటర్నెట్లో పైరసీ దర్శనమిస్తోంది. పైరసీ అడ్డుకునేందుకు ఎవరు ఎన్ని ప్రయత్నాలు చేసినా ఇది ఆగడం లేదు. తాజాగా రవితేజ హీరోగా తెరకెక్కిన 'రాజా ది గ్రేట్' విడుదలై బాక్సాఫీసు వద్ద మంచి రెస్పాన్స్ సొంతం చేసుకుంది. అయితే సినిమా పైరసీ కూడా జోరుగా సాగుతుండటంతో దర్శక నిర్మాతలు ఆందోళన చెందుతున్నారు. 'రాజా ది గ్రేట్' మూవీ పైరసీ లింకులు కొందరు ఏకంగా ఫేస్ బుక్ లో కూడా షేర్ చేస్తున్నారు. దీనిపై ఆవేదన వ్యక్తం చేస్తూ అనిల్ రావిపూడి ఇటీవల ట్వీట్ చేసిన సంగతి తెలిసిందే. శంషాబాద్ ఎయిర్ పోర్టు లాంజ్ లో ఓ మహిళ ల్యాప్ టాప్ లో రాజా ది గ్రేట్ పైరసీ చూస్తుండగా నిర్మాత ఎస్‌కెఎన్ ఫోటో తీసి ట్విట్టర్లో పెట్టారు. ఇది చాలా దురదృష్టకరం. సినిమాలను బతికించండి ప్లీజ్" అని వ్యాఖ్యానించాడు. ఈ ట్వీట్ ను అనిల్ రావిపూడి రీ ట్వీట్ చేశారు. రాజా ది గ్రేట్ పైరసీ గురించి సైబర్ సెల్ లో నిర్మాతలు ఫిర్యాదు చేశారు. అయితే పైరసీ లింకులు విదేశీ సర్వర్లలో ఉండటంతో ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంది. దిల్‌రాజు సమర్పణలో శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బేనర్‌పై రవితేజ హీరోగా రూపొందుతోన్న చిత్రం 'రాజా ది గ్రేట్'. అనిల్‌రావిపూడి దర్శకుడు. శిరీష్ నిర్మాత. మెహరీన్ హీరోయిన్. ఈ సినిమా అక్టోబర్ 18న విడుదలయి హిట్ టాక్ తెచ్చుకుంది.




## మళ్లీ సాయి ధరమ్ తేజ్ పెళ్లి లొల్లి..



సినిమా ఇండస్ట్రీలో రూమర్లు, గాసిప్స్ ముందు పుట్టి వార్తలు తర్వాత పుడుతాయి. ఇక హీరో, హీరోయిన్ల అఫైర్ల విషయంలో హద్దు అదుపు ఉండదు. ఇద్దరు కలిసి రెండు, మూడు చిత్రాల్లో నటించారంటే చాలు.. ఇక వారి మధ్య రిలేషన్, అఫైర్ అంటూ రూమర్లు విస్తృతంగా ప్రచారం అవుతుంటాయి. ఇందుకు మెగా కాంపౌండ్ నుంచి వచ్చిన సాయి ధరమ్ తేజ్ అతీతుడేమీ కాదు. ఇటీవల కాలంలో తనతో వరుస చిత్రాల్లో నటించిన హీరోయిన్‌తో పెళ్లి అంటూ తాజాగా ఓ వార్త వెబ్ మీడియాలో హడావిడి చేస్తున్నది. అయితే తాజా వార్తల్లో పెళ్లి ఫిక్స్ అంటూ ఓ వెబ్‌సైట్ కథనాన్ని ప్రచురించింది. అందులో వాస్తవం ఎంత ఉందనే విషయంపై సాయిధరమ్ తేజ్ స్పందిస్తే తప్ప అసలు విషయం బయటపడదు. సాయిధరమ్ తేజ్ మెగా కాంపౌండ్ నుంచి వచ్చినప్పటికీ.. తనదైన శైలిలో దూసుకెళ్తున్నాడు. సరైన కథలకు పచ్చజెండా ఊపుతూ వరుస విజయాలను సొంతం చేసుకొంటున్నాడు. ప్రస్తుతం జవాన్ చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నాడు. అయితే పిల్లా నీవు లేని జీవితం, సుబ్రమణ్యం ఫర్ సేల్ చిత్రాల్లో రెజినా కసాండ్రా, సాయి ధరమ్ తేజ్ కలిసి నటించారు. ఆ సమయంలో జరిగిన పరిచయం స్నేహంగా.. అక్కడి నుంచి ప్రేమలో పడినట్టు రూమర్లు వచ్చాయి. రెజినాతో ప్రేమ విషయాన్ని సాయిధరమ్ తన కుటుంబ సభ్యులకు చెప్పి ఒప్పించారనే నిరాధారమైన వార్త ఒకటి మీడియాలో నానింది. అయితే రెజినాతో సాయితో పెళ్లికి విముఖత చూపించిందని కూడా వార్తలు వచ్చాయి. ప్రస్తుతం కెరీర్‌పైనే దృష్టిపెట్టాను. పెళ్లి గురించి ఆలోచన లేదని రెజినా చెప్పినట్టు సమాచారం.

# హామీలే తప్ప విశ్వనగరం ఏదీ?



గన్‌ఫౌండ్రి: జీహెచ్ఎంసీ ఎన్నికల సందర్భంగా అనేక హామీలు గుప్పించిన రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ ఆచరణలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడంలో ఘోరంగా విఫలమయ్యారని భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటరమణి విమర్శించారు. ప్రజలను మభ్యపెట్టేందుకు మోసపూరిత వాగ్దానాలు చేస్తారే తప్ప విశ్వనగరంపై ఎలాంటి ప్రణాళిక లేదని దుయ్యబట్టారు. నగరాభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం నిరసిస్తూ భాజపా నగర అధ్యక్షులు, శాసనమండలి పక్ష నేత ఎన్.రాంచందర్‌రావు ఆధ్వర్యంలో ఈ నెల 21న సంతకాల సేకరణ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు శుక్రవారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జాతీయ బాల కార్మిక సలహా మండలి వైస్ చైర్మన్ బి.వెంకట్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్.ప్రకాశ్‌రెడ్డి, నగర పార్టీ ప్రధాన కార్యదర్శులు టి.రాజశేఖర్‌రెడ్డి, జి.రామన్‌గౌడ్, ఆలె జితేంద్ర తదితరులతో కలిసి మాట్లాడారు. నగరాభివృద్ధికిగానూ వంద రోజుల ప్రణాళిక ఏమైందో ప్రజలకు తెలపాలని డిమాండ్ చేశారు. జీహెచ్ఎంసీకి స్వయం ప్రతిపత్తి లేకుండా చేశారని దుయ్యబట్టారు. నగరంలోని రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, తదితర వాటిపై అనేక హామీలు గుప్పించి ఆచరణలో మాత్రం ఒక్క అడుగు కూడా ముందుకు సాగలేదన్నారు. నగర సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ ఈ నెల 21న నగరంలోని ట్యాంక్‌బండ్‌పై ఉన్న లవ్ హైదరాబాద్ చిహ్నం వద్ద సేవ్ హైదరాబాద్ పేరిట సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

# పశు, పక్రుతి సంపదను కాపాడుకోవాలి

## హైరేంజ్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్‌లో షహెన్‌షా



ముషీరాబాద్: రూ.25 కోట్ల విలువైన షహెన్‌షా (దున్నపోతు)కు హై రేంజ్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు దక్కింది. ముషీరాబాద్‌కు చెందిన అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, తెరాస నేత ఎడ్ల హరిబాబుయావ్ సదర్ ఉత్సవాల్లో ప్రదర్శించేందుకు ఈ దున్నపోతును తీసుకువచ్చారు. ముర్రాజాతికి చెందిన అత్యంత ఖరీదైన, ప్రత్యేకతలున్న దున్నపోతుగా గుర్తించిన హై రేంజ్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ సంస్థ ప్రతినిధులు 2017 ఏడాదికి వర్డల్ మోస్ట్ ఎక్స్‌పెన్సివ్ బుల్‌గా రికార్డ్స్‌లో నమోదు చేశారు. సత్తర్‌బాగ్‌లో సంస్థ ప్రతినిధులు సుమన్, శ్రీకాంత్.. సర్వసతీ ఉపాసకులు దైవజ్ఞశర్మతో కలిసి రికార్డు ధ్రువపత్రాన్ని హరిబాబు యాదవ్‌కు అందజేశారు.

# రాష్ట్రంలో చట్టాలు దుర్వినియోగం

బాలసముద్రం : ప్రజల పోరాటాలు, త్యాగాలతో ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రంలో చట్టాలు దుర్వినియోగమవుతున్నాయని తెలంగాణ ఐకాస ఛైర్మన్ ఆచార్య కోదండరాం పేర్కొన్నారు. హన్మకొండ నక్కలగుట్టలోని ల్యాండ్‌మార్క్ హోటల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నేరాలు చేస్తారనే సమాచారం ఉన్నప్పుడు ముందస్తుగా అరెస్టు చేసి సదరు వ్యక్తిపై 151 సెక్షన్ విధించి కేసు నమోదు చేస్తారు.. ఇదెక్కడి న్యాయమని కోదండరాం ప్రశ్నించారు. తెలంగాణ అమరుల స్ఫూర్తియాత్రకు కొన్ని కోట్ల అనుమతులు ఇచ్చి, మరికొన్ని చోట్ల ఆటంకం కల్పిస్తున్నారని చెప్పారు. నిజామాబాద్ జిల్లాలో అనుమతులు ఇచ్చిన తర్వాత తెరాస నాయకులు ఉద్దేశపూర్వకంగా యాత్రను అడ్డుకున్నారని వివరించారు. 15 రోజుల ముందు అనుమతులకు దరఖాస్తు చేసుకున్నా నిర్ణయం వెలువరించకుండా జాప్యం చేస్తున్నారని తెలిపారు. రాజ్యాంగబద్ధమైన హక్కులకు ఆటంకం కల్పించవద్దని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును సైతం లెక్క చేయడంలేదని చెప్పారు. ప్రభుత్వంలో, ప్రభుత్వరంగ సంస్థల్లో ఉన్న ఖాళీలను ప్రకటించి తక్షణమే నియామకాలు చేపట్టాలన్నారు. 2 లక్షల ఉద్యోగాల భర్తీ కోసం క్యాలెండర్ విడుదల చేయాలన్నారు.

# అమరావతిలో వంద అడుగుల ఆదిశంకరాచార్యుల విగ్రహం

**- 10 లక్షల మంది అన్యమతస్తులను హిందుమతంలోకి ఆహ్వానం**

**- నేడు విశాఖ శారదాపీఠాధిపతి స్వరూపనందేంద్ర జన్మదిన వేడుకలు**

**- పీఠం ధర్మాధికారి కామేశ్వర శర్మ**




విశాఖపట్నం : విశాఖ శారదాపీఠం ఆధ్వర్యంలో అమరావతిలో వందఅడుగుల ఆదిశంకరాచార్యుల విగ్రహం ఏర్పాటుచేయనున్నట్లు పీఠం ధర్మాధికారి కామేశ్వరశర్మ తెలిపారు. ఆదివారం వి.జె.ఎఫ్. ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు ఆరునెలలుగా చేస్తున్నామన్నారు. త్వరలోనే శుభముహూర్తాన స్వరూపనదేంద్ర చేతులమీదుగా ఈ విగ్రహం ఆవిష్కరించడం జరుగుతుందన్నారు. స్వరూపనదేంద్ర నాగులచవితి పర్వదినాన జన్మించారని, అందువల్ల అదేరోజు పీఠం ప్రాంగణంలో అత్యంత వైభవంగా ఆయన పుట్టినరోజు వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా పీఠంలో కొలువున్న శారదామాత, దేవతామూర్తులకు పంచామృతాభిషేకాలు, హోమాలు నిర్వహిస్తామన్నారు. తెలుగు రాష్ట్రాల్లో స్వామిజీ భక్త బృందాలు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాన్నారు. అన్నదానం, వస్త్రదానం, గోదానంతో పాటు ఇంకా అనేక సేవలు నిర్వహిస్తారన్నారు. పీఠంలో కూడా అన్నదానం, వస్త్రదానం చేయడంతో పాటు విశాఖలోని పలు ప్రాంతాల్లో పండ్లు, రొట్టెలు పంపిణీ జరుగుతుందన్నారు. పుట్టినరోజు వేడుకలు అనంతరం స్వామిజీ తెలుగురాష్ట్రాల్లో పర్యటించి అనేక దేవాలయాలను సందర్శిస్తానన్నారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న అనేక ఆలయాల మరమ్మత్తు పనుల్లో నాణ్యత, ఆచారాలు పాటించకుండా జరుగుతున్నట్లు స్వామిజీ దృష్టికి వచ్చిందని, దీనితో వాటిని పరిశీలించి దేవాదాయ శాఖతోనే తిరిగి సరిచేయించే కార్యక్రమం చేపట్టడం జరుగుతుందన్నారు. ప్రధానంగా అనేక గిరిజన ప్రాంతాలతోపాటు ఇతర చోట్ల కూడా సుమారు 10 లక్షల మంది అన్యమతస్తులను తిరిగి హిందూమతంలోకి తీసుకువచ్చే ప్రయత్నాలను చేస్తున్నామన్నారు. ఇప్పటికే మతాలు మారిన వారి విజ్ఞప్తిల మేరకు ఈ కార్యక్రమం చేపట్టడం జరుగుతుందన్నారు.

విశాఖ ఆర్కేబీచ్‌లోనూ ఆదిశంకరాచార్యుల విగ్రహం ఏర్పాటుచేసే ప్రయత్నం చేస్తున్నామన్నారు. సోమవారం జరగనున్న స్వరూపనందేంద్ర జన్మదిన వేడుకల్లో అంతా పాల్గొనాలని ఆయన ఆహ్వానించారు. ఈ సమావేశంలో శారదాపీఠం ట్రస్టీ నివాస్, భక్తబృందం ప్రతినిధి, వైజాగ్ జర్నలిస్టు ఫోరమ్ అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు, శారదాపీఠ పాలిత ఆలయాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఆధార్‌పై ఆర్బీఐ స్పష్టతపై

# సుప్రీంలో పిటిషన్




దిల్లీ: బ్యాంకు ఖాతాలతో ఆధార్ అనుసంధానం తప్పనిసరి అంటూ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్బీఐ) స్పష్టం చేసిన మరుసటి రోజు ఈ విషయంపై సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఆధార్ విషయంలో ఆర్బీఐ నిర్ణయానికి రాజ్యాంగ సమ్మతి ఉందా అని ప్రశ్నిస్తూ.. కల్యాణి మీనన్ సేన్ అనే మహిళ సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. అంతేగాక.. ఆధార్‌ను మొబైల్ నంబర్లతో అనుసంధానం చేయాలంటూ టెలికాం శాఖ జారీ చేసిన ఆదేశాలను కూడా ఆమె ప్రశ్నించారు. ఈ రెండు నిర్ణయాలు వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగించేలా ఉన్నాయని, ఇది రాజ్యాంగ విరుద్ధమని కల్యాణి తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఆధార్ తప్పనిసరి అంటూ రిజర్వ్ బ్యాంకు ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వలేదని, ఈ విషయాన్ని సమాచార హక్కు చట్టం కింద అడిగిన ప్రశ్నకు సమాధానంగా పేర్కొందంటూ ఇటీవల వార్తలు వచ్చాయి.

వీటిపై స్పందించిన ఆర్బీఐ.. నగదు అక్రమ చెలామణీ రెండో సవరణ నిబంధనల ప్రకారం బ్యాంకు ఖాతాలకు ఆధార్ సంఖ్యను అనుసంధానం చేయడం తప్పనిసరి. అంటూ వివరణ ఇచ్చింది. డిసెంబర్ 31లోగా ఈ అనుసంధాన ప్రక్రియ చేసుకోవాలని సూచించింది.

# వైద్యురాలి హత్యకు కుట్ర



హైదరాబాద్ : వ్యాపార లావాదేవీల్లో వివాదాలు, పాతకక్షల నేపథ్యంలో వైద్యురాలిని హత్యచేయడానికి కుట్రపన్నిన కేసును రాచకొండ కమిషనరేట్ పరిధి హయత్‌నగర్ పోలీసులు ఛేదించారు. ఎల్బీనగర్ డీసీపీ వెంకటేశ్వరరావు శనివారం హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో కేసుకు సంబంధించిన వివరాలను విలేకరులకు వెల్లడించారు. నగర శివారు బండ్లగూడ సమీపంలోని ఇందు అరణ్య అపార్టుమెంట్‌లో నివాసం ఉండే బొమ్మినేని దుర్గారాణి(42) వైద్యురాలు. అదే కాలనీలో నివాసం ఉండే బుర్ర రమేష్‌గౌడ్, ఆమెతో కలిసి కర్మన్‌ఘాట్‌లోని జీవన్ ఆసుపత్రి, పెద్దపల్లిలోని శ్రీసాయి ఆసుపత్రిలో వ్యాపార భాగస్వాములుగా ఉండేవారు. వ్యాపార పరమైన వివాదాల కారణంగా విడిపోయి ఒకరిపై ఒకరు పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు. రష్యాలో ఎంబీబీఎస్ పూర్తిచేసి సాధించిన పట్టా నకిలీదని తేలడంతోపాటు ఇతత్రతా ఫిర్యాదులపై పోలీసులు రమేష్‌గౌడ్‌ను అరెస్టుచేశారు. దీంతో దుర్గారాణిపై కక్ష పెంచుకున్న అతడు ఆమెను ఎలాగైనా హతమార్చాలని నిర్ణయించుకుని వరంగల్ జిల్లా హసన్‌పర్తి మండలం సీతంపేటకు చెందిన తన స్నేహితుడు జంపాల రమేష్‌ను ఆశ్రయించాడు. ఈ క్రమంలో జంపాల రమేష్ తనకు సుపరిచితుడైన రఫీకి విషయం చెప్పాడు. దుర్గారాణిని హత్యచేసేందుకు ఈ ఏడాది మార్చిలో అతడు రూ.10 లక్షలు సుపారీ మాట్లాడుకుని ఏప్రిల్‌లో విడతల వారిగా రూ.5 లక్షలు అడ్వాన్సుగా తీసుకున్నాడు. పెద్దపల్లి, ఇందు అరణ్య, కర్మన్‌ఘాట్‌లలో రెక్కీ నిర్వహించాడు. ఇలా సాధ్యపడకపోవడంతో వె%ద్యురాలితో పరిచయం పెంచుకుని ఆమె నమ్మకాన్ని సాధించాలని అనుకున్నాడు. దుర్గారాణి భర్త రమేష్‌బాబుకు ఫోన్‌చేసి మీ భార్య హత్యకు రమేష్‌గౌడ్ కుట్రపన్నాడని, కిరాయి మనుషులను మాట్లాడాడని హన్మకొండలోని ఓ బార్‌లో మాట్లాడుకుంటుండగా తాను విన్నానని రఫీ తెలిపాడు. ఇలా దుర్గారాణిని కలవడానికి వెళ్లిన ప్రతిసారి చంపడానికి తనతో బటన్‌కత్తి తీసుకువెళ్లాడు. ఒకటికి రెండుసార్లు రఫీ చెప్పడం, బెదిరింపు ఫోన్లు రావడంతో ఈనెల 16న వైద్యురాలు హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన పోలీసులు రఫీపై అనుమానంతో అతని ఫోన్‌కాల్స్ ఆధారంగా దీనికి వెనుక ఉన్నది రమేష్‌గౌడ్, జంపాల రమేష్, తిరుపతి(ఇతని ద్వారా రఫీకి డబ్బులు అందించారు)గా నిర్ధరించారు. ఈ మేరకు వారిని అరెస్టు చేసి శనివారం కోర్టులో హాజరుపరిచారు. ప్రధాన నిందితుడు రమేష్‌గౌడ్ విదేశాలకు వెళ్లినట్లు సమాచారం. పరారీలో ఉన్న ఎ-4 తిరుపతి కోసం పోలీసులు గాలిస్తున్నారు. సమావేశంలో వనస్థలిపురం ఏసీపీ రవీందర్‌రెడ్డి, హయత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ నరేందర్‌గౌడ్, ఎస్సై రాజువర్మ ఉన్నారు.



# నాగుల చవితి విశిష్టత

దీపావళి అమావాస్య తరువాత వచ్చే కార్తీక శుద్ధ చతుర్థిని నాగుల చవితి పండుగ అంటారు. కొందరు శ్రావణ శుద్ధ చతుర్థినాడు జరుపుకుంటారు. ప్రక ృతి మానవ మనుగడకు జీవనాధరమైనది కనుక దానిని దైవస్వరూపంగా భావించి మన పూర్వీకులు చెట్టును, పుట్టను, రాయిని, రప్పను, కొండను, కోనను, నదిని, పర్వతాన్ని - ఇలా సమస్త ప్రాణికోటిని దైవస్వరూపంగా చూసుకొంటూ! పూజిస్తూవస్తున్నారు. ఇదే మనభారతీయ సంస్కృతిలోని విశిష్టత. నిశితంగా పరిశీలిస్తే ... అందులో భాగంగానే ' నాగుపాము" ను కూడా నాగరాజుగా, నాగదేవతగా పూజిస్తూ వస్తున్నారు.

ఈ పాములు భూమి అంతరాగేమందు నివసిస్తూ భూసారాన్ని కాపాడే ప్రాణులుగా సమస్త జీవకోటికి " నీటిని" ప్రసాదించే దేవతలుగా తలచేవారు. ఇవి పంటలను నాశనంచేసే క్రిమికీటకాదులను తింటూ, పరోక్షంగా " రైతు " కు పంటనష్టం కలగకుండా చేస్తాయట!. అలా ప్రక ృతి పరంగా అవి మనకు ఎంతో సహాయపడుతూ ఉంటాయి. మన పురాణాలలో నాగుల చవితి గురుంచి ఎన్నో గాథలు ఉన్నాయి. దేశమంతట పలు దేవాలయల్లో మెలికలతో ఉన్న నాగేంద్రుని విగ్రహాలు కనిపిస్తూ ఉంటాయి. ఈ నాగుల చవితి నాడు నాగేంద్రుని శివభావముతో అర్పిస్తే సర్వరోగాలు పోయి సౌభాగ్యవంతులవుతారని భారతీయుల నమ్మకం.

ఈ మానవ శరీరమనే పుట్టకు తొమ్మిది రంధ్రాలు ఉంటాయి. వాటినే నవరంధ్రాలు అంటూ ఉంటారు. మానవ శరీరంలో నాడులతో నిండివున్న వెన్నెముకను ' వెన్నుబాము' అని అంటారు. అందు కుండలినీశక్తి మూలాధారచక్రంలో "పాము" ఆకారమువలెనే వుంటుందని "యోగశాస్త్రం" చెబుతోంది. ఇది మానవ శరీరంలో నిదురిస్తున్నట్లు నటిస్తూ! కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలనే విషాల్ని గ్రక్కుతూ, మానవునిలో ' సత్వగుణ' సంపత్తిని హరించి వేస్తూ ఉంటుందని అందుకు ' నాగుల చవితి రోజున ప్రత్యక్షంగా విషసర్పపుట్టలను ఆరాధించి పుట్టలో పాలు పోస్తే మానవునిలో ఉన్న విషసర్పం కూడా శ్వేతత్వం పొంది, అందరి హ ృదయాలలో నివసించే ' శ్రీమహావిష?వు" నకు తెల్లని ఆదిశేషువుగా మారి శేషపాన్పుగా మారాలని కోరికతో చేసేదే! ఈ నాగుపాము పుట్టలో పాలు పోయుటలోగల అంతర్యమని చెప్తారు.



నాగుల చవితి రోజు ఆవు పాలు పుట్టలో పోసి నాగపూజచేసి చలిమిడి, చిమ్మిలి (నువ్వులతో చేస్తారు) అరటిపళ్ళు, తాటి బుర్రగుంజు , తేగలు మున్నగున్నవి నివేదన చేస్తారు. ఆ సందర్రేగా పుట్టవద్ద " దీపావళి" నాడు మిగిలిన మతాబులు, కాకరపువ్వొత్తులు, టపాసులు మొదలైనవి చిన్నపిల్లలు ఎంతో సంతోషంగా కూడా కాలుస్తారు.

మన భారతీయుల చాల ఇళ్ళల్లో ఇలవేల్పు " సుబ్రహ్మణేశ్వరుడే ఆరాధ్య దైవంగా పూజిస్తారు కాబట్టి వారి పేరును చాల మంది నాగరాజు, ఫణి, సుబ్రహ్మణ్యం, సుబ్బారావు వగైరా పేర్లు పెట్టుకుంటూ ఉంటారు.








Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published from ANH Apartments, Block-A, Flat No. 508, Bazar Ghat, Red Hills, Hyderabad-500 004. and printed at **VIJAYABHANU PRESS**, D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003. R.N.I. No. 37754/81. Postal Regd. No. H-HD-1017/2006-08, Phone : 040 23370933, Fax : 040 66770933, Cell: 9701529570 ☆ e-mail: vijayabhanudaily@gmail.com